ప్రజాశక్తి

శుక్రవారం 25 నవంబర్ 2022 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

భారీగా ఆస్తులున్నా..

నైవేద్యమూ కరువే..

- 'ఊళ్లపాలెం' శ్రీకోదండ రామడి ఆలయానికి చెన్నైలోనూ విలువైన ఆస్తులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



ప్రజాశక్తి-శింగరాయకొండ

శ్రీ కోదండ రామస్వామి దేవస్థానం అంటే ఆ చుట్టుపక్కల గ్రామాలలో మంచి ఆస్తులున్న దేవుడిగా ఒకప్పుడు పేరుంది. ఈ ఆలయం నిత్య పూజలతో వెలిగిపోయేది. అలాంటి శ్రీ కోదండ రామస్వామికి ఇప్పుడు కష్టాలు వచ్చి పడ్డాయి. ఆయన ఆస్తిని అమ్ముకున్నారో తెలియదు. అవసరాలకి వాడుకున్నారో తెలియదు. ఇప్పుడు ఆ దేవస్థానం పరిస్థితి దారుణంగా ఉందని గ్రామస్తులే చెబుతున్నారు. నిత్య పూజలతో ప్రతి సంవత్సరం వైభవంగా తిరుణాళ్లతో అలరారే ఈ దేవస్థానం ఈ రోజు నైవేద్యానికి కూడా ఇబ్బంది పడాల్సి వచ్చింది. ప్రజాప్రతినిధుల తీరే దీనికి కారణమని గ్రామస్తులంటున్నారు.

శింగరాయకొండ మండలం, ఊళ్లపాలెంలో ఉన్న శ్రీ కోదండ రామస్వామి దేవస్థానానికి ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా చెన్నైలో కూడా విలువైన ఆస్తులున్నాయి. రూ.కోట్ల ఆస్తులున్నా ధూపదీప నైవేద్యాలకూ డబ్బుల్లేక దాతల సహకారంతో దేవస్థానాన్ని నడుపుతున్న పరిస్థితి ఇక్కడ ఉంది. దేవస్థానం పాడుబడిపోయినప్పటికీ పట్టించుకునే నాథుడు లేడు. తెలుగుదేశం, వైసిపి నాయకులు మాటలు చెప్పిపోతున్నారు తప్ప దేవస్థానం అభివృద్ధికి మాత్రం సహకరించడం లేదు. ఈ దేవస్థానం నేడు శిథిలావస్థలోకి వెళ్లింది. అధికారంలోకి వచ్చిన తర్వాత దేవస్థానాన్ని అభివృద్ధి చేస్తామన్న వైసీపీ నేతలు ఇప్పుడు అటువైపు కూడా చూడని పరిస్థితి. మాజీ సర్పంచ్ పివి.రెడ్డి గత ▶ 2లో

'బాలినేని'కి కీలక జిల్లాలు

- ఎన్నికల కోసమే సరికొత్త వ్యూహాలు
- జిల్లాకు ఒక పారిశ్రామికవేత్త.. ఒక రాజకీయవేత్త



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఎన్నికల కోసం పాలకపక్షం నాయకత్వ మార్పులు, చేర్పులు చేపట్టింది. అందులో భాగంగానే పార్టీకి అత్యంత సన్నిహితులు, అనుయాయులుగా ఉండే సీనియర్ నేతలకు కీలక బాధ్యతలు అప్పగించారు. రాజకీయ, ఆర్థిక వ్యవహారాలు సమన్వయంతో నిర్వహించేలా నేతలను ఎంపిక చేసి.. బాధ్యతలను అప్పగించారు. ఇప్పటివరకూ బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు కోఆర్డినేటర్‌గా ఉన్న సీనియర్ నేత బాలినేని శ్రీనివాసరెడ్డికి వీటిని తప్పించి మరో మూడు కీలక జిల్లాలను అప్పగించారు. నెల్లూరు, తిరుపతి, కడప జిల్లాలను బాలినేనికి అప్పగించారు.

ఎన్నికల వరకూ ఈ మూడు జిల్లాల్లో పార్టీ వ్యవహారాలన్నీ బాలినేని చూడాల్సి ఉంటుంది. వాస్తవానికి కొత్తగా అప్పగించిన మూడు జిల్లాలు పార్టీకి కూడా అత్యంత కీలకంగా మారాయి. ఇక్కడే ఎక్కువ స్థానాలు గెలుచుకునేందుకు వ్యూహంలో ఉన్నారు. అందుచేత బాలినేనికి ఇక్కడ కోఆర్డినేటర్ బాధ్యతలను అప్పగించారని సమాచారం. సిఎం జగన్‌కు సమీప బంధువు కావడంతో ఈ మూడు జిల్లాలు అప్పగించారనే చర్చ సాగుతోంది. కడప జిల్లా అంటే ఎంతో కీలకమైనదిగా భావిస్తున్నారు. బాలినేనికి కూడా ఈ బాధ్యత కీలకంగా మారింది. ప్రస్తుతం ఉన్న ప్రకాశం, బాపట్ల జిల్లాలోనే పోటాపోటీగా పరిస్థితులు మారుతున్నాయి. నెల్లూరు నుంచి తిరుపతి, కడప జిల్లాల్లోనే పార్టీ బలంగా ఉంది. ఈ నేపథ్యంలో బాలినేనికి మరింత సులభతరంగా మారిందనే చర్చ కూడా ఉంది. అన్ని జిల్లాలకు ఇద్దరి చొప్పున నేతలను కేటాయించారు. బాలినేనికి మాత్రం తనొక్కరే మూడు జిల్లాలు బాధ్యతలు చూసుకునేలా అవకాశం ఇచ్చారు. ప్రకాశం, బాపట్ల జిల్లాలతో పాటు పల్నాడు జిల్లాలకు కలిపి ఇద్దరు నేతలను నియమించారు. వారిలో ఒకరు పారిశ్రామికవేత్తగా ఉండగా.. మరొకరు రాజకీయ అనుభవం ఉన్న నేతగా ఉన్నారు. నెల్లూరు జిల్లాకు చెందిన బీదా మస్తాన్‌రావుతో పాటు తిరుపతికి చెందిన ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డిని ఈ మూడు జిల్లాలకు కోఆర్డినేటర్లుగా బాధ్యతలు అప్పగించారు. ఎన్నికల్లో రాజకీయ, ఆర్థిక వ్యవహారాలను సమన్వయంతో చూసేలా వీరికి బాధ్యతలు అప్పగించారనేది విశ్లేషణ. జిల్లా అధ్యక్షుడిగా జంకె వెంకటరెడ్డిని నియమించారు. ఆయన పార్టీలో సీనియర్ నేతగా ఉన్నారు. పశ్చిమాన ప్రాధాన్యత ఇచ్చే క్రమంలో జంకెకు అవకాశం కల్పించారు. మధుసూధన్‌యాదవ్‌ను తప్పించారు. ఆయన పనితీరు అనేదానికన్నా సామాజిక సమతుల్యతలను పరిగణలోకి తీసుకునే మార్పు జరిగిందంటున్నారు. బీదా మస్తాన్‌రావును కోఆర్డినేటర్‌గా వేసినందున అదే సామాజిక వర్గానికి చెందిన బుర్రాను తప్పించినట్లు చర్చ సాగుతోంది. ఏదేమైనా ఈ మార్పులన్నీ రానున్న ఎన్నికల కోసమే జరిగాయనే చర్చ పాలకపక్షంలో జరుగుతోంది. పర్చూరు ఇన్‌ఛార్జి వ్యవహారం కూడా మరోసారి చర్చలోకి వచ్చింది. ఆమంచి కృష్ణమోహన్ పేరును పర్చూరుకు పరిశీలిస్తున్నారు. ఆయనపై ఉన్న కేసుల రీత్యా కొద్ది రోజుల తర్వాతే దీనిపై నిర్ణయం ఉంటుందని సమాచారం. అద్దంకిలో బాచిన చైతన్య, చీరాలకు కరణం వెంకటేశ్ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులుగా దాదాపుగా ఖరారైనట్లేనని సమాచారం.

తూకాల్లో మోసం..

- పత్తి రైతులను దోపిడీ చేస్తున్న దళారులు, వ్యాపారులు
- రిమోట్ పద్ధతిలో తక్కువ తూకం
- క్వింటాకు రూ.800 నుంచి వెయ్యి దాకా నష్టం



ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రైతులకు పంట చేతికి వచ్చాక మార్కెట్ కష్టాలు మొదలవుతున్నాయి. ఇందులో రవాణా ఖర్చును భరించే శక్తి చాలామందికి ఉండదు. అందుకని రైతులు గ్రామాల్లోనే దళారులకు అమ్ముకుంటున్నారు. ముఖ్యంగా పత్తి రైతులు మార్కెట్ దాకా పంట దిగుబడి తీసుకెళ్లి విక్రయించేందుకు రవాణా ఖర్చు పెట్టలేకపోతున్నారు. గ్రామాలకు వచ్చే కమీషన్ వ్యాపారులకు సరుకును అమ్ముకొని నష్టపోతున్నారు. దళారుల మీద నమ్మకం పెట్టుకొని దగా పడుతున్నారు. పశ్చిమ ప్రకాశంలోని పలు గ్రామాల్లో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి.

రైతుల దగ్గర పత్తి కొనడానికి వచ్చే వ్యాపారులు కొన్ని చోట్ల రాళ్ళ కాటాలు, మరికొన్ని చోట్ల ఎలక్ట్రానిక్ కాటాల్లో సాంకేతికను వాడుకొని క్వింటా పత్తికి 8 నుంచి 12 కేజీలకు పైగా ఎక్కువ సరుకును కొల్లగొడుతున్నారు. కొందరు దళారులు ఇదే విధంగా తూకాల్లో మోసం చేయడం రైతులు గమనించారు. పోలీసులకు ఫిర్యాదు చేసి దళారుల నుంచి డబ్బును రాబట్టుకున్నారు. ఇలా అనేక చోట్ల జరుగుతోంది. వ్యవసాయ మార్కెట్‌లో భారతీయ పత్తి సంస్థ ఆధ్వర్యంలో క్వింటా పత్తి రూ.6,380 పలుకుతోంది. మార్కాపురంలో సిసిఐ కేంద్రాలు ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటికీ అక్కడ విక్రయించడానికి రైతులు మొగ్గు చూపడం లేదు. ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. ప్రైవేటు వ్యాపారులు గుడ్డి పత్తి రూ.ఐదు వేలు, తేమ ఉంటే రూ.ఆరు వేలు, నాణ్యమైన పత్తి రూ.7800 నుండి రూ.8800 చొప్పున కొనుగోళ్లు చేస్తున్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో..

ఆరుగాలం శ్రమించి పండించిన పంటలను దళారులు, కమీషన్ వ్యాపారులు అడ్డగోలుగా దోచుకుంటున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కాటాలో బరువును నియంత్రించి మోసాలకు పాల్పడుతున్నారు. సాధారణంగా పత్తి బొరెం రూపంలో బరువు తూకం వేస్తారు. దళారులు, కమీషన్ వ్యాపారులు ఎలక్ట్రానిక్ కాటాలతో వాహనాల్లో పత్తి రైతుల ఇళ్ల దగ్గరికి, పొలాల దగ్గరికి వెళ్లి కొంటున్నారు. కొందరు రైతులతో మాట్లాడి కాంట్రాక్ట్ పద్ధతిలో కొంటున్నారు. మరికొందరు పత్తి దిగుబడిని క్వింటాళ్ల రూపంలో కొంటున్నారు. ఆ సమయంలో వారు వెంట తెచ్చుకున్న కాటాతో బరువు తూచేటప్పుడు ఎలక్ట్రానిక్ కాటాలలో చిప్ పెట్టి రిమోట్ సహాయంతో తక్కువ తూకం వచ్చేలా చేస్తున్నారు. మరికొందరు కాటాలలో 8 నుంచి 12 కిలోల బరువు తక్కువ వచ్చేలా అడ్జెస్ట్ చేసి పెట్టుకొని బోరేల తూకంలో మోసం చేస్తున్నారు. ఒకరు కాటా వద్ద ఉండగా, రిమోట్‌తో మరొక వ్యక్తి కొంచెం దూరంగా ఉండి కూలీలు పత్తి మూటను కాటాపై పెట్టాక రిమోట్ ఆపరేటింగ్ ద్వారా కాటాలో తూకం తక్కువ చూపించేలా చేస్తారు. రిమోట్ ఏ అనే బటన్ నొక్కితే 10 కిలోలు, బీ అనే బటన్ నొక్కితే 20 కిలోలు తక్కువగా చూపేలా సాంకేతికంగా ఏర్పాటు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ రిమోట్‌ను 150 మీటర్ల ▶ 2లో

పెండింగ్ కేసులు తగ్గించేందుకు

అదనపు కృషి చేయాలి

- నిందితులకు కఠిన శిక్ష పడేలా చూడాలి
- పోలీసు అధికారులకు ఎస్‌పి మల్లికగర్గ్ ఆదేశం



ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించేందుకు పోలీసు సిబ్బంది అదనపు కృషి చేయాలని ఎస్‌పి మల్లికగర్గ్ ఆదేశించారు. ఎస్‌పి కార్యాలయంలో నేరసమీక్షా సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీసు సిబ్బంది తమ వృత్తి నైపుణాన్ని మెరుగుపరుచుకుంటూ శాస్త్రీయ పద్ధతులలో కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. కోర్టు ట్రయల్‌కు సమర్ధవంతంగా హాజరవుతూ నిందితులకు కఠినశిక్ష పడే విధంగా కృషి చేయాలన్నారు. ప్రజలు సైబర్ నేరాలు, ఫెక్‌లోన్ ఆగడాలకు గురికాకుండా అవగాహన కల్పించాలన్నారు. రోడ్డుప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసకోవాలన్నారు. చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలపాలపై నిత్యం నిఘా ఉంచి కట్టడి చేయాలన్నారు. దొంతనాలు, మిస్సింగ్ కేసులను టెక్నాలజీ ఉపయోగించి చేధించాలన్నారు. నేరాలు జరగకుండా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. రాత్రి సమయంలో రెగ్యులర్ బీట్లతో వాహనాలను తనిఖీ చేయాలన్నారు. రౌడీషీటర్ల స్థితిగతులపై తనిఖీ నిర్వహించాలన్నారు. పాతనేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. సమావేశంలో ఎఎస్‌పిలు కె.నాగేశ్వరరావు (అడ్మిన్), ఎస్‌వి.శ్రీధరరావు(క్రైం), ఎన్.సూర్యచంద్రరావు (ఎస్‌ఇ.బి), అశోక్‌బాబు(ఎఆర్), ఎస్‌బి డిఎస్‌పి బి.మరియదాసు, సిఐలు పాల్గొన్నారు.

తూకాల్లో మోసం..

(మొదటిపేజీ తరువాయి)

దూరం నుంచి రైతులు గుర్తించకుండా ఆపరేట్ చేసే వీలుంటుంది. 10 నుంచి 12 కిలోల పత్తి తక్కువ తూచడం వల్ల ఇప్పుడున్న ధరను బట్టి క్వింటా మీద రూ.800 నుంచి వెయ్యి వరకు రైతులు నష్టపోతున్నారు. ఒక రైతు 15 క్వింటాళ్లు దళారికి విక్రయిస్తే మార్కెట్ రేటు ప్రకారం రూ.12 నుంచి రూ.15 వేలకు పైగా నష్టం వస్తోంది.

అవగాహన కల్పించని మార్కెటింగ్ శాఖ..

వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి విక్రయిస్తే ధరల్లో, తూకాల్లో పారదర్శకత ఉంటుందని రైతులకు మార్కెటింగ్ శాఖ అవగాహన కల్పించాలి. అయితే ఇటీవల మార్కెటింగ్ శాఖ అధికారులు గ్రామాల వైపు కన్నెత్తి చూడడం లేదు. తూకాల్లో మోసం చేస్తే చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. ఈ విషయంపై రైతులకు అవగాహన లేక పోవడంతో దళారుల చేతిలో దగా పడుతున్నారు. మార్కెట్ శాఖ అధికారులు రైతుల్లో ఈ విషయంపై చైతన్యం తీసుకురావాలి.

కాటాలలో మోసాలు జరుగుతున్నాయి

కైపు బ్రహ్మారెడ్డి, రైతు, మురారిపల్లి

పత్తి కొనుగోళ్లకు సంబంధించి ప్రైవేటు వ్యాపారులు ఎక్కువ ధర చెల్లిస్తామని చెబుతూ కాటాలలో మోసాలకు పాల్పడుతున్నారు. కొంతమంది వ్యాపారులు ఎలక్ట్రానిక్ కాటాలలో చిప్‌లు పెట్టి పత్తి కాటాలలో కేజీలు తగ్గిస్తున్నారు. రైతులు వారి స్వంత కాటాలు తెచ్చుకుని పత్తి అమ్ముకోవాలి. ప్రభుత్వం మార్కెట్ యార్డులలో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన రైతులకు ఒరిగిందేమీ లేదు.

దళారుల చేతిలో నష్టపోతున్నాం..

పాశం వెంకటేశ్వర్లు, రైతు, కుందంపల్లి

ఈ ఏడాది కాలం కలిసి రాలేదు. అకాల వర్షాల వల్ల పత్తి తెగుళ్ళ వ్యాపించి పూత, పిందె రాలిపోయింది. పెట్టుబడులు పెరిగిపోయాయి. ఎకరానికి నాలుగైదు క్వింటాళ్లకు మించి దిగుబడి రావటం లేదు. పత్తి రైతులు నష్టపోతున్నారు. దళారుల చేతిలో రైతులు మోసపోతున్నారు.

సిసిఐ కేంద్రాల్లో క్వింటాకు రూ.పది వేలివ్వాలి

గాలి వెంకటరామిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

మార్కాపురంలోని మార్కెట్ యార్డులలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రంలో క్వింటా పత్తి రూ.6380కి మించి కొను గోలు చేయడం లేదు. ప్రభుత్వ ధర కంటే ఎక్కువ ధర బయట ఉండటంతో రైతులు సిసిఐ కేంద్రాలకు రావడం లేదు. ఫలితంగా మార్కాపురం సిసిఐ కేంద్రంలో క్వింటా పత్తి కూడా విక్రయాలు జరగలేదు. రైతుల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని క్వింటా రూ.10 వేల చొప్పున కొనుగోలు చేయాలి.



మాట్లాడుతున్న జేసీ

కంపెనీల ఏర్పాటుతో ఉద్యోగ అవకాశాలు : జేసీ

ప్రజాశక్తి-పామూరు

నిమ్జ్ ద్వారా కంపెనీలు ఏర్పాటు చేస్తే నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని జాయింట్ కలెక్టర్ అభిష్తిక్ కిషోర్ తెలిపారు. మండల పరిధిలోని బోదవాడ గ్రామంలో పర్యావరణ-ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ నిమ్జ్‌కు సంబం ధించిన కంపెనీలు వస్తున్నాయని, ఇక్కడ కంపెనీలు ఏర్పాటు చేయడం చుట్టు ప్రక్క గ్రామాలకు ఎలాంటి పొల్యూషన్ సమస్యలు ఉండవని తెలిపారు. కంపెనీలకు నీరు, విద్యుత్, గ్రామాలకు ఎంత దూరం ఉండాలనే విషయంపై అధికారులు ప్రజలతో చర్చించారు. ఏమైనా సమస్యలు ఉంటే అర్జీ రూపంలో రెవెన్యూ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు ప్రసాద్, ఆర్ఐ ప్రవీణ్‌కుమార్, డిటీ వెంకటేశ్వర్లు, విఆర్ఒ దానియేలు, రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు కృషి

జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి




మాట్లాడుతున్న డాక్టర్ రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

సీజనల్ వ్యాధుల నివారణకు కృషి చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్. రాజ్యలక్ష్మి ఆదేశించారు. డిఎం,హెచ్ఒ ఛాంబర్‌లో సీజనల్ వ్యాధులపై గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ వాతావరణం మారితే సీజనల్ వ్యాధులు ఇబ్బంది పెడతాయని తెలిపారు. వర్షాకాలంలో ఈసమస్య మరీ ఎక్కువగా ఉంటుందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో మురుగు నీటి కారణంగా దోమలు ఎక్కువ అయ్యాయని తెలిపారు. వాటికి తోడు వాతావరణ మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు అధికమవుతున్నాయన్నారు. చాలా మంది సీజనల్ ఫీవర్స్‌తో బాధపడుతున్నారన్నారు. దగ్గు, జలుబు, గొంతు నొప్పి, జ్వరం, కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలు, శ్వాసకోశ సమస్యలు, తిన్న ఆహారం జీర్ణం కాక పోవడం లాంటి సీజనల్ వ్యాధులు వస్తున్నాయన్నారు. ఈ సమావేశంలో ఉప వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాధవీలత, డిపిఎంఒ డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ శ్రీవాణి, డిపిహెచ్ఎన్ఒ సుగుణమ్మ, డిపిఒ సుబ్బలక్ష్మి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సహాయనిధి చెక్కులు అందజేత



సహాయనిధి చెక్కులు అందస్తున్న ప్రణీత్ రెడ్డి

ఒంగోలు సబర్బన్ : పేదల ఆరోగ్యం పట్ల ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పుడు ముందుంటారని, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పేదల గురించి ఎప్పుడూ ఆలోచిస్తుంటారని వైసిపి యువనాయకులు బాలినేని ప్రణీత్‌రెడ్డి తెలిపారు. ఒంగోలుకు చెందిన షేక్ కరిముల్లా కుమారుడు షేక్ ఖాజా తలసేమియా వ్యాధితో బాధపడుతున్నాడు. చికిత్స కోసం పెద్ద మొత్తంలో డబ్బులు అవసరం కావడంతో అంత ఆర్థిక స్తోమత లేక నగరంలోని 45వ డివిజన్ వైసిపి నాయకుల ద్వారా సమస్యను ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి చెప్పుకున్నారు. బాలినేని శ్రీనివాసరెడ్డి సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి సిఎం రిలీఫ్ ఫండ్ రూ.20 లక్షలు మంజూరు చేయించారు. ఖాజా ప్రస్తుతం చెన్నైలోని వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు రూ.20 లక్షలను ఖాజా కుటుంబానికి బాలినేని ప్రణీత్‌రెడ్డి గురువారం అందజేశారు. వివిధ వ్యాధులకు చికిత్స పొందుతున్న మరో నాలుగు కుటుంబాలకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, ఒంగోలు ఎంపీపీ పల్లపోతు మల్లికార్జున్ రెడ్డి, వైసిపి మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ జలీల్, బొమ్మినేని మురళి, 45వ డివిజన్ వైసిపి నాయకులు వెన్నపూస వెంకటేశ్వరరెడ్డి, రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారీగా ఆస్తులున్నా..నైవేద్యమూ కరువే..

(మొదటిపేజీ తరువాయి)

తెలుగుదేశం ప్రభుత్వంలో దేవస్థానం భూములు వివరాలను సేకరించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ భూములు మొత్తాన్ని గుర్తించి దేవస్థానాన్ని అభివద్ధి చేస్తామని చెప్పి.. ఇప్పుడు మరిచిపోయారు. గతంలో పనిచేసిన పాలకమండల సభ్యులు, చైర్మన్ల పనితీరే ఆలయ దుస్థితికి కారణమని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ దేవస్థానం పరిధిలో ఆస్తులు మాత్రం ఊల్లపాలెంలో మూడు ఎకరాలా 30 సెంట్లు, బింగినపల్లిలో మూడు ఎకరాలా 36 సెంట్లు, పెళ్లూరులో ఆరు ఎకరాలా 25 సెంట్లు, కొత్తపట్నం మండలం, అల్లూరు-చింతల మధ్యలో 17 ఎకరాలా ఐదు సెంట్లు, ఊళ్లపాలెంలో ఉప్పుకొటారు భూములు 75 సెంట్లు.. ఉన్నాయి. అప్పుడు దేవస్థానంలో పనిచేస్తున్న పనివారికి ఎనిమిది ఎకరాల భూమిని ఇచ్చారు. దీని పక్కనే ఊళ్ళ పాలెం గ్రామంలో మరో రెండు ఎకరాల భూమి ఉంది. ఈ భూమి మొత్తాన్నీ వైసీపీ, తెలుగుదేశం నాయకులు అప్పనంగా వాడుకుంటున్నారు తప్ప దేవస్థానానికి ఒక్క రూపాయి కూడా ఇవ్వని పరిస్థితి ఉంది. దీంతో పాటు కోట్ల రూపాయలు విలువచేసే భూమి భవనం చెన్నైలోని టీ నగర్‌లో ఉంది. గత కొన్ని సంవత్సరాలుగా దేవస్థానం అధికారులు గ్రామస్తులు ఆ భవనాన్ని వెతుకుతూనే ఉన్నారు. రికార్డుల్లో ఉన్న ఆ భవనం వివరాలు ఆ సర్వే నెంబర్ ఆధారంగా సులువుగా తీయాల్సిన అధికారులు, ఇక్కడ దేవస్థానం పాలక మండలి సభ్యులు, చైర్మన్ చెన్నైలో భవనాన్ని గుర్తించలేని పరిస్థితి. 20 సెంట్లు ఉన్న ఈ భవనం విషయం తేలని పరిస్థితి ఉంది. చెన్నై టీ నగర్‌లో ఉన్న ఈ భవనాన్ని అమ్మేశారా? అక్కడ ఆక్రమణలకు గురైందా? అనే విషయాన్ని తేల్చాల్సిన పరిస్థితి ఉంది. ఆస్తుల జాబితా ఉంది గానీ ఆస్తుల నుంచి రూపాయి కూడా గుడికి రావడం లేదని, ఆ భూములు ఆక్రమణలకు గురయ్యాయని గ్రామస్తులు చెబుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు జోక్యం చేసుకొని దేవస్థానాన్ని అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కత్తెర పురుగుతో అపార నష్టం

ప్రజాశక్తి-పంగులూరు

ప్రస్తుతం ఉన్న వాతావరణం పరిస్థితుల్లో మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు సోకటం సహజమైందని, దీనివలన పంటకు అపారమైన నష్టం జరుగుతోందని, ఐసిఆర్‌పిఎస్ ప్రాజెక్ట్ రిసోర్స్ పర్సన్ సుబ్బారావు అన్నారు. కత్తెర పురుగు నివారణకు ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో అగ్నిస్త్రం అనే మందును గురువారం మండలంలోని కోటపాడు గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో తయారు చేశారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ, ఇప్పుడున్న వాతావరణ పరిస్థితుల్లో మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు వెంటనే వ్యాపిస్తుందని, రసాయన పద్ధతుల్లో మందులు వాడాలంటే, చాలా ఎక్కువ మొత్తంలో ఖర్చవుతోందని సుబ్బారావు అన్నారు. దీనిని ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో, అగ్నిస్త్రం తయారు చేసుకోవడం ద్వారా, తక్కువ ఖర్చుతో కత్తెర పురుగు నివారించడంతోపాటు, పంట కూడా ఆరోగ్యవంతంగా ఉంటుందని, దీంతోపాటు అంతర పంటలుగా మినుము, పెసర, కూడా సాగు చేసుకోవచ్చని సుబ్బారావు అన్నారు. ఈ అగ్నిస్త్రం మందును ఇంటి దగ్గర తయారు చేసుకోవచ్చని, ఆయన తెలిపారు. ఈ మందును తయారు చేసుకునేందుకు ఒక కుండను తీసుకొని, అందులో 10 లీటర్ల ఆవు మూత్రన్ని పోయాలన్నారు. అందులో ఒక కిలో పొగాకు చూర్ణాన్ని కలపాలన్నారు. తరువాత అరకిలో పచ్చిమిర్చి కాయల చూర్ణాన్ని కూడా అందులో కలపాలని తెలిపారు. ఇందులో ఐదు కిలోల వేపాకు గుజ్జును కలిపి, 30 నిమిషాల పాటు, ఐదుసార్లు పొంగు వచ్చేవరకు వేడి చేయాలని తెలిపారు. ఈ కషాయాన్ని 24 గంటల పాటు పులియబెట్టి, తరువాత ఒక గుడ్డలో వడకట్టి ద్రావణాన్ని వేరు చేయాలని అన్నారు. ఒక లీటరు నీటికి 2.5 మిల్లి లీటర్లు కషాయాన్ని కలిపి మొక్కలు బాగా తడిసే విధంగా పిచికారీ చేస్తే, కత్తెర పురుగును మొక్కజొన్న పంట నుంచి పూర్తిగా తొలగించవచ్చని సుబ్బారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్.2 రాయిని విజయలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.



మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో మందు తయారు చేస్తున్న దృశ్యం

కారు సెన్సార్లు చోరీ

ప్రజాశక్తి- మద్దిపాడు

రూ.7 లక్షల విలువైన కార్ల సెన్సార్లు చోరీకి గురైన ఘటనపై కేసు నమోదు చేసినట్లు మద్దిపాడు ఎస్ఐ శ్రీరామ్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. రేనాల్డ్ షోరూం సెక్యూరిటీ మేనేజర్ కూడేరు భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మండల పరిధిలోని వెంకట్రాజు పంచాయతీ పరిధిలోనున్న షో రూమ్‌లో భాస్కర్ సెక్యూరిటీ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 23న రాత్రి సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

ఆ రోడ్డు గార్డుగా విధులు నిర్వహించిన వెన్నెల సమాచారం మేరకు స్టోర్ రూం తెరిచి చూడగా మెయిన్ ఆఫ్ చేసి ఉంది. స్టోర్ రూంలోని రెండు కారు సెన్సార్లు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో చదివేలా కృషి: విద్యాశాఖ జెడి

ప్రజాశక్తి-మార్టూరు రూరల్: ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి పాఠశాలలో నాడు-నేడు కింద మెరుగైన సౌకర్యాలు కల్పిస్తుందని విద్యా శాఖ జాయింట్ డైరెక్టర్ చంద్రిక అన్నారు. గురువారం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను జెడి ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా మార్టూరు సమీపంలోని డేగర్లమూడి ఎంపిపి పాఠశాలలను సందర్శించి జగనన్న విద్యాకానుక ద్వారా విద్యార్థులకు అందించిన కిట్‌లోని బ్యాగ్, స్కూల్ యూనిఫామ్ ఇతర వస్తువుల నాణ్యతను పరిశీలించారు. ప్రతి విద్యార్థి అమ్మ ఒడి పథకాన్ని వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని ఎంఈఓ వస్రాంనాయక్‌ను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను స్థానిక ప్రజా ప్రతినిధులు, విద్య, సంక్షేమ సహాయకులు, పంచాయతీ కార్యదర్శి, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి విద్యార్థుల సంఖ్యను పెంచేలా కృషి చేయాలని జెడి తెలిపారు. అనంతరం మార్టూరులోని మద్ది సత్యనారాయణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి నాడు నేడు పథకం ద్వారా నిర్మిస్తున్న గదులను పరిశీలించారు. అనంతరం క్లాస్ రూంలో విద్యార్థులను పలు ప్రశ్నలు అడుగుతూ వారిలోని సామర్థ్యాన్ని పరీక్షించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డేగరముడి సర్పంచ్ జంపని అంజమ్మ, వైసిపి నాయకులు వీరయ్య చౌదరి, ప్రధానోపాధ్యాయులు దుడ్డు డేవిడ్, రాంబాబు సీఆర్పీ రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

ప్రజాశక్తి-చెరుకుపల్లి

చెరుకుపల్లిలో అనధికారికంగా మద్యం సేవించేందుకు అనుమతించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిఐ దేవర శ్రీనివాస్ తెలిపారు. గురువారం చెరుకుపల్లిలోని తెనాలి రోడ్డులో మద్యం సేవించేందుకు అనుమతించి పబ్లిక్ న్యూసెన్స్‌కు కారణమైన కూల్ డ్రింక్ షాప్ యజమానులు దాసరి మునీశ్వరరావు, ఉయ్యూరు రామకృష్ణ, అన్నం ఓబులస్వామిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. కూల్‌డ్రింక్ షాపుల్లో అనధికారకంగా మద్యం సేవించేందుకు అనుమతిస్తే కేసు నమోదు చేస్తామని సీఐ దేవర శ్రీనివాస్ హెచ్చరించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి-నిజాంపట్నం

మండలంలోని కూచినపూడి హైస్కూల్‌ను, మధ్యాహ్న భోజన పథకాన్ని మండల ప్రత్యేక అధికారి పి సురేష్ పరిశీలించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేస్తూ పిల్లలతో కలిసి భోజనం చేశారు. ఎంపీడీఓ నర్రా నాగలక్ష్మి ఆముదాలపల్లి, నిజాంపట్నం-3 అంగన్‌వాడీ సెంటర్లను తనిఖీ చేశారు. వంట సమయంలో శుచి శుభ్రతలు పాటించాలని కోరారు. మెనూ ప్రకారం తయారు చేసిన వంట పదార్థాలు పరీక్షించి, వంటకాలు రుచి చూసి సంతృప్తి చెందారు. గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ రాగిపిండి, బెల్లం, చిక్కి, ఎండుఖర్జూరం, సజ్జలు, అటుకులు వంటి ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని అందించారు. పిల్లల విషయంలో పలు జాగ్రత్తలు, సూచనలు తెలియజేశారు. సచివాలయాలను, పాఠశాలలు తనిఖీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

ప్రజాశక్తి-చెరుకుపల్లి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బి శ్రీనివాసరావు తెలిపారు. సమావేశానికి రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు హాజరవుతారని ఆయన తెలిపారు. మధ్యాహ్నం నుంచి జరిగే సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

పేద విద్యార్థినికి వాకర్స్ అసోసియేషన్ చేయూత

ప్రజాశక్తి-చీరాల: స్థానిక ఎన్‌ఆర్‌అండ్‌పిఎం హైస్కూల్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పాలవలస మహాలక్ష్మి అనే విద్యార్థినికి అసోసియేషన్ ప్రతినిధులు గురువారం రూ.5,500 ఆర్థిక సాయాన్ని అందజేశారు. అటు చదువులోనూ ఇటు అథ్లెటిక్స్‌లోనూ రాణిస్తూ జూనియర్ విభాగంలో రన్నింగ్, లాంగ్ జంప్‌లలో పసిడి పతకాలు సాధించిన విద్యార్థినికి వాకర్స్ అసోసియేషన్ సభ్యులు స్పోర్ట్స్ ఆర్టికల్స్ కొనుగోలు చేసేందుకు ఆర్థిక సహాయం అందచేయడం హర్షణీయమని అన్నారు. క్రీడలలో మంచి నైపుణ్యంతో రాణించి పట్టణానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఐ పీఎం గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు అమరా వీరాంజనేయులు, పోలుదాసు రామకష్ణ, వలివేటి మురళీకృష్ణ, మామిడాల శ్రీనివాసరావు, డేగల తిరుపతిరావు, డివి సురేష్, ఎంఎస్‌పి వెంకటస్వామి, జగన్మోహనరావు, చారుగుళ్ల ప్రసాద్, రమేష్, పూర్ణచంద్రరావు, శివాజీ, వాకింగ్ మిత్రులు పాల్గొన్నారు.

అభివృద్ధికి చేయూత: బాచిన కృష్ణ చైతన్య

ప్రజాశక్తి-మేదరమెట్ల

రావినూతల గ్రామ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని రాష్ట్ర శాప్ నెట్ చైర్మన్ బాచిన కృష్ణ చైతన్య అన్నారు. గురువారం మండలంలోని రావినూతల జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో భోజనశాల నిర్మాణానికి భూమి పూజ, శంకుస్థాపన నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కారుసాల రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ కారుసాల నాగేశ్వరావు జ్ఞాపకర్థం వారి కుటుంబ సభ్యులు రూ.20 లక్షలు వెచ్చించి విద్యార్థులకు భోజనశాల నిర్మించడానికి ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. అలాగే పాఠశాల కరెంట్ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సాధినేని లక్ష్మీ కుమారి, ఎంపీడీవో సురేష్‌బాబు గ్రామ సర్పంచి విజయవీణ ఉప సర్పంచ్ రామినేని చెంచయ్య విద్యా కమిటీ చైర్మన్ నాగవేణి, కన్వీనర్ మస్తాన్‌రావు, పంచాయతీరాజ్ జై హనుమంతరావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు. అనంతరం కొరిశపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతులకు శంకుస్థాపన చేశారు.

విజేతలకు బహుమతులు పంపిణీ

ప్రజాశక్తి-పర్చూరు: స్వాతంత్ర్య సమరయోధులను ఆదర్శంగా తీసుకోవాలని పర్చూరు ఉపవిద్యాశాఖాధికారి ఎ కిరణ్‌కుమార్ సూచించారు. పర్చూరు మండలంలోని నాగులపాలెం బాలయోగి గురుకుల బాలికల, శాతవాహన పాఠశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. 'స్వాతంత్ర్య సమరయోధుల జీవిత విశేషాలను విద్యార్థులు తెలుసుకోవాలనే అవసరం', 'అల్లూరి సీతారామరాజు జయహో' అనే అంశంపై పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు నాగభైరు శ్రీనివాసరావు, పంబి సదానందరెడ్డి, అసిస్టెంట్ గవర్నర్ పోపూరి నాగేశ్వరరావు, కాసా అశోక్, కె ఆంజనేయులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ బాధ్యత అందరిదీ..

ప్రజాశక్తి-సంతమాగులూరు: బాలల హక్కుల పరిరక్షణ, వారి పట్ల నేర నివారణ బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర బాలల సంరక్షణ కమిటీ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. గురువారం మండలంలోని ఏల్చూరు కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల, ఏల్చూరు, సంతమాగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ డి సుధ, ఐసిడిఎస్ సూపర్ వైజర్‌లు, మహిళా పోలీసులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న పద్మావతి

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

ప్రజాశక్తి-సంతమాగులూరు

హత్య కేసులో నిందితుడుగా ఉన్న మండలంలోని ఏల్చూరు గ్రామానికి చెందిన వల్లెం అలియాస్ వల్లెపు లక్ష్మయ్యకు, గురువారం ఒంగోలు 2వ ఏడిజె కోర్టు న్యాయమూర్తి ఎంఎ సోమశేఖర్ జీవిత ఖైదు తీర్పును వెలువరించారు. ఏల్చూరు గ్రామంలో 2019 ఏప్రిల్ 12వ తేదీ రాత్రి సమయంలో మృతుడు కంబపు శ్రీను ఇంటిలో భార్యా పిల్లలతో కలిసి భోజనం చేస్తుండగా, నిందితుడు వల్లెం లక్ష్మయ్య.. కంభపు శ్రీను తన భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడనే కోపంతో డబ్బాలో యాసిడ్ తీసుకెళ్లి కంభపు శ్రీను తల మీద పోశాడు. తీవ్రంగా గాయపడిన శ్రీను ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ కేసుకు దర్యాప్తు అధికారులుగా అప్పటి సంతమాగులూరు ఎస్ఐ వై నాగరాజు, అప్పటి అద్దంకి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం హైమారావులు వ్యవహరించి భౌతిక ఆధారాలు సేకరించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కేసును వేగంగా దర్యాప్తు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి సంబంధిత కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు. బాపట్ల జిల్లా ఎస్పి వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు డిఎస్పి శ్రీనివాసరావు సూచన మేరకు, సంతమాగులూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఏ శివరామకృష్ణారెడ్డి పర్యవేక్షణలో హెడ్ కానిస్టేబుల్ వి మస్తాన్‌రెడ్డి సాక్షుల ద్వారా సరైన పద్ధతిలో, నిర్భయంగా సాక్ష్యం చెప్పే విధంగా తర్ఫీదునిచ్చారు. కేసు పూర్వాపరాల పరిశీలించిన న్యాయమూర్తి ఎంఎ సోమశేఖర్ లక్ష్మయ్యకు జీవిత ఖైదు జైలు శిక్షతో పాటు, రూ.1,02,000 అపరాధ రుసుము విధిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో 1,00,000 రూపాయలు మృతుడి భార్యకు పరిహారం నిమిత్తం చెల్లించాలని తీర్పు వెలువరించారు. హత్య కేసులో నిందితుడికి శిక్షపడేలా చర్యలు తీసుకున్న అధికారులను, కోర్టు మానిటరింగ్ సిబ్బందిని జిల్లా ఎస్పి వకుల్ జిందాల్ ప్రత్యేకంగా అభినందించారు.

కౌలు రైతు మృతి

ప్రజాశక్తి-చుండూరు

చుండూరు మండలం ఆలపాడు గ్రామంలో కౌలు రైతు ఆలపాటి సుబ్బారావు మృతి చెందారు. గ్రామంలోని అమృతలూరు శకుంతలకు చెందిన 1.20 ఎకరాల సాగు భూమిని సన్న కారు కౌలు రైతు ఆలపాటి సుబ్బారావు కౌలుకు తీసుకొని పొలంలో వరి పంట సాగు చేస్తున్నాడు. పంట అంతా పురుగులు తిని వేయడంతో మస్తాపానికి గురయ్యాడు. పంట పొలం వద్దనే మృతిచెందాడు. పంట సరిగా పండక, పెట్టిన పెట్టుబడి కూడా రాక, నష్టం వచ్చేటట్లు ఉండటంతో పొలం దగ్గరికి వెళ్లి పండిన పంటను చూసి మనస్తాపానికి గురై మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. సుబ్బారావు మృతదేహాన్ని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగర్జున పొలంలోనే సందర్శించారు. కౌలు రైతు సుబ్బారావు ఏ కారణంతో మృతి చెందారో తెలుసుకుని ఆ కుటుంబాన్ని ఆదుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చుండూరు తహశీల్దారు బి కనకదుర్గ, సిబ్బంది వచ్చి పంచనామా నిర్వహించారు. వీఆర్వో బాలశౌరి, అగ్రికల్చర్ ఏవో కూడా సుబ్బారావు మృతదేహాన్ని సందర్శించారు.

మాజీ సర్పంచ్ కొల్లా దశరథ రామయ్య మృతి

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు మండలంలోని కొల్లావారిపాలెం మాజీ సర్పంచ్ కొల్లా దశరథరామయ్య(83) మృతి చెందారు. కొంతకాలంగా హైదరాబాదులో కుమారుని వద్ద ఉంటున్నారు. అనారోగ్యంతో మృతి చెందగా హైదరాబాదులోనే అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దశరథ రామయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

నేడు కావూరులో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-చెరుకుపల్లి

మండలంలోని కావూరులో శుక్ర, శనివారాల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తుమ్మల కాళిదాసు స్మారకార్థం, ఆయన 16వ వర్ధంతి సందర్భంగా నిర్వహించే ఉచిత వైద్య శిబిరంలో అన్ని రకాలైన వ్యాధులకు, కళ్ళకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. కావూరులోని ప్రభుత్వ వైద్యశాల పక్కన ఉన్న డాక్టర్స్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించే వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేదల అభ్యున్నతే లక్ష్యం

ప్రకాశం జడ్‌పి ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

రాష్ట్రంలో అభివృద్ధి జగనన్నతోనే సాధ్యమవుతుందని ప్రకాశం జిల్లా పరిషత్ ఛైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ పేర్కొన్నారు. ఇంకొల్లు మండలంలోని దుద్దుకూరు ఆచార్య రంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.41 లక్షలతో నిర్మించిన నాడు-నేడు పనులను వెంకాయమ్మ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కొద్దిసేపు మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. అమ్మఒడి, జగనన్న విద్యా కానుకతో పాటు అనేక కార్యక్రమాలు జగన్ మోహన్‌రెడ్డి పేద విద్యార్థుల కోసం చేస్తున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా అభివృద్ధి పనులు శర వేగంగా జరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీలో పలు అభివృద్ధి పనులను వెంకాయమ్మ చేతుల మీదుగా ప్రారంభించారు. సభకు జడ్పీటీసీ మాజీ సభ్యులు భవనం శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు. వైసీపీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త రావి రామనాథంబాబు మాట్లాడుతూ గడప గడపకూ తిరిగి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని వాకబు చేస్తున్నామన్నారు. సంక్షేమ పథకాలు పేదలకు నేరుగా అందేందుకు జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని కొనియాడారు. దర్శి మాజీ శాసన సభ్యులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఎన్నారై రాయిని సుబ్బరామయ్య సహకారంతో గ్రామంలో అనేక అభివృద్ధి పనులు చేయటం పట్ల సుబ్బరామయ్యను అభినందించారు. పాఠశాల పక్షాన అతిథులను సత్కరించారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యులు భవనం శ్రీలక్ష్మి, ఎన్నారై రాయిని సుబ్బరామయ్య, ప్రధానోపాధ్యాయిని కె ఈశ్వరివాణి, పర్చూరు ఉప విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్, ఎంపిడిఒ సిహెచ్ కృష్ణతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



దుద్దుకూరు హైస్కూలులో జరిగిన సభలో మాట్లాడుతున్న జడ్పీ ఛైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ

హామీలన్నీ అమలు చేసిన సిఎం జగన్: కోన

ప్రజాశక్తి-కర్లపాలెం

మాట తప్పని, మడమ తిప్పని నాయకుడు వున్నారంటే అది ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఒక్కరే అని మాజీ డిప్యూటీ స్పీకర్, బాపట్ల శాసన సభ్యులు కోన రఘుపతి అన్నారు. గురువారం కర్లపాలెం మండలం పాత నందయపాలెం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వైసిపీ నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకం పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వైసిపీ ప్రభుత్వానికి ప్రజలు బ్రహ్మ రథం పడుతున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ జగన్మోహన్ రెడ్డి అమలు పరిచారని అన్నారు. రాబోయే రోజుల్లో కర్లపాలెం మండలంలో మరింత అభివృద్ధి జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సీతారామరెడ్డి, జడ్పిటిసి వేణుగోపాల్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు సుబ్బారావు, బుల్లయ్య, పాత నందయపాలెం సర్పంచ్ కావూరి చిట్టెమ్మ, ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు, నాయకులు పేరాల వెంకట సురేష్, కావూరి శ్రీనివాసరెడ్డి, అయ్యప్పరెడ్డి, పులుగు లక్ష్మారెడ్డి, కొండలు, జగ్గయ్య, హరిబాబురెడ్డి, శివారెడ్డి అధికారులు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల పుస్తకాన్ని పంపిణీ చేస్తున్న బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి



నగరం మండలం పమిడిమర్రులో గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొన్న మోపిదేవి

అద్దంకి: ప్రజలకు వైసీపీ ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టి వాలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి దగ్గరకే పథకాలను చేరవేస్తోందని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాచిన కృష్ణ చైతన్య అన్నారు. గురువారం మండల పరిధిలోని చిన్న కొత్తపల్లి సచివాలయ పరిధిలోని గోవాడ గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాచిన కృష్ణ చైతన్య మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు ముఖ్యమంత్రి అనేక పథకాలను ప్రవేశపెట్టి ఆర్థికంగా ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. పేదలకు సొంతింటి కల జగనన్న నెరవేర్చారన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో వేల గృహాలు నిర్మాణాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీలు, ఎంపీటీసీలు సర్పంచులు వివిధ శాఖల అధికారులు, వైసీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



గోవాడ గ్రామంలో వైసీపీ ఇన్‌ఛార్జి బాచిన కృష్ణ చైతన్య ప్రజలతో మాట్లాడుతున్న దృశ్యం

నగరం: గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం మండల పరిధిలోని పమిడిమర్రు గ్రామంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి పేరుపేరునా ఆప్యాయంగా పలకరిస్తూ వారికి అందుతున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఎటువంటి సమస్య ఉన్నా వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అర్హత ప్రామాణికంగా తీసుకుని పేదలందరికీ జగనన్న ప్రవేశపెట్టిన పథకాలు అందాలని సూచించారు. నాడు నేడు పథకం ద్వారా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి దేశంలోని ఏ ప్రభుత్వమూ చేపట్టలేదని అన్నారు. దేశంలోనే ఆదర్శంగా ఆంధ్ర రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు నిలిచాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట నగరం మండల పరిషత్ అధ్యక్షుడు చింతల శ్రీకృష్ణయ్య, సర్పంచ్ పి వీరయ్యగిరిజారాణి, జడ్పిటిసి నాగమణి, నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలతో ఇబ్బందులు: వ్యకాస

ప్రజాశక్తి-అద్దంకి

ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల వ్యవసాయ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం బాపట్ల జిల్లా కన్వీనర్ మోంద్రు ఆంజనేయులు పేర్కొన్నారు. అద్దంకి మండల మూడో మహాసభలు స్థానిక సింగరకొండలోని జైభీమ్ భవనంలో కొమరగిరి హనుమంతరావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. మోంద్రు ఆంజనేయులు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులకు సంవత్సరంలో కనీసం వంద రోజులైనా పని దినాలు లేకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో కొంత ఆసరాగా ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసి అవినీతిపరులకు ఆదాయ వనరుగా మార్చారని విమర్శించారు. జిల్లా నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ మిగులు భూములను వ్యవసాయ కార్మికులకు, పేదలకు పంచి పెట్టాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ఏర్పాటు చేసిన పుచ్చలపల్లి సుందరయ్య కలలు నెరవేర్చే విధంగా రాబోయే కాలంలో ఈ ప్రాంతంలో భూ పోరాటాలు నిర్వహించాలని కోరారు. అనంతరం అద్దంకి మండల నూతన కమిటీని ఆరుగురితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షులుగా కొమరగిరి హనుమంతరావు, కార్యదర్శిగా మోంద్రు చిన్న సుబ్బారావు, ఉపాధ్యక్షులుగా యేసు మన్నెమ్మ, సహాయ కార్యదర్శిగా సుబ్బులమ్మ, కమిటీ సభ్యులుగా నాగూరు, కె హనుమంతరావు పాల్గొన్నారు.



భట్టిప్రోలు మండల మహాసభలో మాట్లాడుతున్న అగస్టీన్

భట్టిప్రోలు: దేశంలో ఉపాధిహామీ పథకం కింద రూ.2 లక్షల కోట్లు నిధులు కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షులు బొనిగల అగస్టీన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం భట్టిప్రోలు వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభ ప్రజా సంఘాల కార్యాలయంలో జరిగింది. ఈ సభకు నాయకులు పప్పుల అహరోను అధ్యక్షత వహించారు. ఉపాధి కూలీలకు పూర్తి స్థాయిలో పనిదినాలు కల్పించి, పని పూర్తయిన పది రోజులలోగా వేతనాలు చెల్లించాలని కోరారు. అలాగే ఈ నెల 27వ తేదీన బాపట్ల జిల్లా మొదటి మహాసభ చినగంజాంలో జరుగుతుందని, దానిని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా పి అహరోను, కార్యదర్శిగా మురుగుడు సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా జి సుధాకర్, టి బసవయ్య, సహాయ కార్యదర్శిగా డేవిడ్ మరో 11 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.



అద్దంకి మండల మహాసభలో మాట్లాడుతున్న ఆంజనేయులు



వక్తృత్వ పోటీల్లో మాట్లాడుతున్న విద్యార్థులు

పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి: డాక్టర్ బాబూరావు

ప్రజాశక్తి-చీరాల

విద్యార్థులందరూ పోటీతత్వాన్ని అలవర్చుకొని విద్యారంగంలో అభివృద్ధి చెందాలని తద్వారా ఉన్నత భవిష్యత్తు లభిస్తుందని రోటరీ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ ఐ బాబురావు అన్నారు. గురువారం చీరాల రోటరీ మరియు ఇన్నర్ వీల్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో రోటరీ సామాజిక భవనంలో రోటరీ యువజన వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు 4వ రోజు వక్తృత్వ పోటీలలో భారత స్వాతంత్ర్య సమరయోధులు, భారతీయ శాస్త్రవేత్తలు, భారత చక్రవర్తులు అనే అంశం మీద పోటీలు జరిగినట్లు తెలిపారు. ఈ పోటీలకు వివిధ పాఠశాలల నుంచి 65 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఎ వీరభద్రచారి, బత్తుల బ్రహ్మారెడ్డి, కె ఏకాంబరేశ్వరబాబు వ్యవహరించారు. కార్యక్రమంలో వలివేటి మురళీకృష్ణ, చీరాల కృష్ణమూర్తి, సుభాషిణి, జి లలిత కుమారి, వెన్నెల, పోలుదాసు రామకృష్ణ, పి శివాంజనేయప్రసాద్, డివి సురేష్, గుర్రం రాఘవరావు, జివై ప్రసాద్, బి హేమంత్ కుమార్, శీరాం రమేష్, ప్రతాప్, విద్యార్థులు పాల్గొన్నారు.




శంకుస్థాపన చేస్తున్న వైసిపి ఇన్‌ఛార్జి రావి రామనాథంబాబు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-యద్దనపూడి

మండల కేంద్రమైన యద్దనపూడి గ్రామ ఎస్‌సి కాలనీలో గురువారం చర్చి కాంపౌండ్ వాల్ నిర్మాణానికి వైసిపి పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త రావి రామనాథంబాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో యద్దనపూడి మండల సీనియర్ నాయకులు పోపూరి ఆదిబాబు గారు, పర్చూరు నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షులు పాలెపోగు రాంబాబు, యద్దనపూడి మండల పార్టీ అధ్యక్షులు సన్నెబోయిన వెంకటప్పయ్య, మండల సీనియర్ నాయకులు చిలుకూరి కృష్ణయ్య, మారెళ్ల విజయ్ కృష్ణ, తుమాటి బాలకృష్ణ, వైస్ ఎంపీపీ ఐమాలా శాంసన్, సర్పంచ్ వలేరు రేణుక బాలకోటేశ్వరరావు, మున్నంగి బసివిరెడ్డి, తనుబొద్ది వీరారెడ్డి, మున్నంగి వీరయ్య, సవరపు వందనం, బిల్లా రంగా తదితరులు పాల్గొన్నారు.



పంట నమోదు పత్రాలు అందజేస్తున్న ఎడిఎ అక్తర్ హుస్సేన్

పంట నమోదు ధ్రువీకరణ పత్రాల అందజేత

ప్రజాశక్తి-రేపల్లె

రేపల్లె మండలంలో ఖరీఫ్ పంట కాలంలో పంట నమోదు చేసుకున్న రైతులందరికీ పంట నమోదు ధ్రువీకరణ పత్రం ప్రతి రైతు భరోసా కేంద్రంలో విధిగా ఇస్తామని రేపల్లె సహాయ వ్యవసాయ సంచాలకులు సయ్యద్ అక్తర్ హుస్సేన్ తెలిపారు. పంట నమోదు ధ్రువీకరణ పత్రం ఒక విధమైన హామీపత్రం లాంటిదని అన్నారు. పంట నష్టపోయినప్పుడుగానీ, ధాన్యం కొనుగోలు సమయంలో గాని బ్యాంకులో పంట రుణాలు తీసుకొనేందుకు పంటల బీమా పథకానికి ధ్రువీకరణ పత్రాన్ని వాడుకోవచ్చని అన్నారు. పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు తమ రైతు భరోసా కేంద్రం నుంచి పంట ధ్రువీకరణ పత్రాన్ని తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఓఆర్ విజయబాబు, రైతులు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారులు

- డ్రైయినేజీలు లేక రోడ్లపైనే మురుగునీరు
- రాకపోకలకు ప్రజల అవస్థలు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - గిద్దలూరు

గిద్దలూరు నగరపంచాయతీ 16వ వార్డు పరిధిలోని పాములపల్లె రోడ్డు, కృష్ణనగర్, ముబారక్ నగర్‌లోని రోడ్లు చిన్నపాటి వర్షానికే బురదమంగా మారుతున్నాయి. డ్రైయినేజీలు లేకపోవడంతో వర్షపు నీరంతా రోడ్లపైనే నిలుస్తోంది. దీంతో రాకపోకలు సాగించేందుకు పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. వృద్ధులు, చిన్నారులు, మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్లపై మురుగునీరు రోజుల తరబడి నిలబడంతో దుర్గంధం వెదజల్లుతున్నట్లు తెలిపారు. దోమలు వ్యాప్తి చెందడంతో రాత్రి సమయంలో కంటి మీదు కునుకే ఉండటం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టి, సైడు కాలువలు నిర్మించాలని వారు కోరుతున్నారు.



బురద మయంగా మారిన పాములపల్లె రోడ్డు



రాజనగర్‌లో రహదారిపై నిలిచిన నీరు

అధికారులు పట్టించుకోవడం లేదు

బి. చంద్ర శేఖర్ యాదవ్,2వ వార్డు కౌన్సిలర్



కౌన్సిలర్‌గా వార్డులోని సమస్యలను పలుమార్లు నగర పంచాయతీ అధికారుల దష్టికి తీసుకెళ్లా. అయినప్పటికీ వారు కనీసం వార్డు వైపు కన్నెత్తి కూడా చూడలేదు. కొమరోలు రోడ్డులో నెలల తరబడి నీరు నిలబడి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే సమస్యలు పరిష్కరించాలి.లేకుంటే సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా.

సమస్యలు పరిష్కరించపోతే ధర్నా చేస్తాం

టి.ఆవులయ్య, సిపిఎం నాయకుడు



నగరపంచాయతీ పరిధిలోని 16వ వార్డులో డ్రైనేజీ కాలువలు, సిసిరోడ్ల సమస్య పరిష్కరించకపోతే మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేస్తాం. సమస్యలు పరిష్కరించాలని గతంలో వార్డు ప్రజలు అనేక మార్లు వినతిపత్రం అందజేశారు. ఫలితం లేకుండా పోయింది. అధికారులకు నగర పంచాయతీలోని మిగిలిన వార్డులపై ఉన్న శ్రద్ధ 16వ వార్డు లేదు. 16వ వార్డు కౌన్సిలర్ నగర పంచాయతీ చైర్మన్ అయినప్పటికీ ఆ వార్డులో సమస్యలు పరిష్కరించక పోవడం విడ్డూరంగా ఉంది.

ఎవరూ పట్టించుకోవడం లేదు

నాగమణి, గృహిణి, కష్ణనగర్



రోడ్లు అధ్వానంగా ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. రోడ్లు నిర్మించాలని అనేక మార్లు మున్సిపల్ కార్యాలయం వద్ద వార్డు ప్రజలు నిరసన తెలిపారు. అయినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. బురద రోడ్లపై రాకపోకలు సాగించే సమయంలో వృద్ధులు, చిన్నారులు జారి పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వార్డులో రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించాలి.

మైనార్టీలపై దాడులు అరికట్టాలి : ఆవాజ్

ప్రజాశక్తి-పామూరు

మైనార్టీలపై దాడులను అరికట్టాలని ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు షేక్ ఖాదర్‌బాషా, గౌరవాధ్యక్షుడు ఎస్‌డి.హనీఫ్ తెలిపారు. స్థానిక సుందరయ్య భవనంలో మస్తాన్ అధ్యక్షతన ఆవాజ్ మండల కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత మైనార్టీలపై దాడులు పెరిగాయని తెలిపారు. వాటిని తిప్పికొట్టాలంటే మైనార్టీలంతా ఐక్యం కావాలన్నారు. ప్రధాని నరేంద్రమోడీ రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. భారతదేశాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. భారత దేశానికి స్వాతంత్ర్యం తెచ్చేందుకు బ్రిటీష్ వారిని తరిమికొట్టిన చరిత్ర దేశానికి ఉందన్నారు. కుల మతాల పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెడుతున్న ఆర్ఎస్ఎస్, బిజెపి దుర్మార్గపు పరిపాలనను ఇంటికి సాగనంపాలన్నారు. ఈ సమావేశంలో ఖాదర్‌బాషా, గౌస్‌బాషా, మస్తాన్, గఫూర్, మాబు సుభాని, షరీఫ్, గులాం సల్మాన్, షబ్బీర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు షేక్ ఖాదర్‌బాషా

'జంకె' శ్రేణుల్లో నూతనోత్సాహం..!

ప్రజాశక్తి-మార్కాపురం

వైసిపి వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఇప్పటి నుంచే అడుగులు వేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా పార్టీని మరింత బలోపేతం చేసే పనిలో భాగంగా వైసిపి జిల్లా అధ్యక్ష స్థానాల్లో కొత్త వారికి అవకాశం కల్పించింది. అందులో భాగంగా ప్రకాశం జిల్లా అధ్యక్ష పదవి మార్కాపురం మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డిని వరించింది. వైసిపి జిల్లా పగ్గాలు జంకె చేతుల్లోకి రావడంతో ఇప్పటి వరకు స్తబ్దతగా ఉన్న జంకె శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది.!

ప్రజల్లో జంకె వెంకటరెడ్డి ప్రత్యేక గుర్తింపు ఉంది. జంకె వెంకటరెడ్డి సౌమ్యుడిగా పేరు గడించారు. రాజకీయ విలువలకు కట్టుబడిన నేతల్లో జంకె ఒకరని చెప్పవచ్చు. జంకె వెంకటరెడ్డికి రాజకీయ వారసత్వం ఉంది. ఆయన తండ్రి జంకె రామిరెడ్డి ఎమ్మెల్యే పనిచేశారు. ఉన్నత చదువులు చదివినా... రాజకీయ వారసత్వాన్ని జంకె వెంకటరెడ్డి కొనసాగించారు. మండలాధీసుడుగా రాజకీయ ఆరంగ్రేటం చేశారు జంకె. అదే సమయంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్‌గా కొనసాగారు. 1994లో స్వతంత్ర అభ్యర్థిగా మార్కాపురం నియోజకవర్గం నుంచి పోటీచేసి భారీ మెజార్టీతో విజయం సాధించారు. 2014లో వైసిపి తరపున పోటీ చేసి మరోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు.



జంకె వెంకటరెడ్డిని అభినందిస్తున్న పార్టీ శ్రేణులు

ప్రలోభాలకు లొంగని 'జంకె'

2014 ఎన్నికల్లో వైసిపి ప్రతిపక్షానికే పరిమితమైంది. టిడిపి అధికారంలోకి తగిన బలంతో వచ్చినా... అప్పటి ప్రతిపక్ష వైసిపి ఎమ్మెల్యేలకు గాలం వేసింది. అందులో 23 మంది వైసిపికి చెందిన ఎమ్మెల్యేలు టిడిపిలో చేరారు. మార్కాపురం డివిజన్‌లోని యర్రగొండపాలెం నుంచి ఎన్నికైన పాలపర్తి డేవిడ్‌రాజు, గిద్దలూరు నుంచి ఎన్నికైనా ముత్తుముల అశోక్‌రెడ్డి టిడిపిలో చేరారు. అదే సమయంలో మార్కాపురం నుంచి వైసిపి తరపున ఎన్నికైన జంకె వెంకటరెడ్డిపై టిడిపిలో చేరాలని ఒత్తిడి పెరిగింది. బంపర్ ఆఫర్ చేసినా జంకె వెంకటరెడ్డి మాత్రం ప్రలోభాలకు లొంగలేదు. దీంతో వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డి వద్ద జంకె వెంకటరెడ్డి ప్రత్యేక అభిమానాన్ని సంపాదించుకున్నారు.

2019 ఎన్నికల నాటికి వైసిపి తరపున మిగిలిన సిట్టింగ్ ఎమ్మెల్యేలు 44 మంది కాగా అందులో 40 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు పోటీ చేసేందుకు జగన్ అవకాశం ఇచ్చారు. కేవలం నలుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మాత్రమే పోటీకి అవకాశం కల్పించలేదు. అందులో జంకె వెంకటరెడ్డి ఒకరు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చింది. సిఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఓ సందర్భంలో జంకె వెంకటరెడ్డి కలవగా ఎమెల్సీగా అవకాశం కల్పిస్తానని గట్టి హామీ ఇచ్చాడు. పార్టీలో జంకె వెంకటరెడ్డికి వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అవకాశం కల్పించారు. ఎమ్మెల్సీగా మాత్రం అవకాశం కల్పించలేదు. దీంతో జంకె శ్రేణుల్లో నిరుత్సాహం నిండుకుంది. పార్టీని నమ్ముకున్న జంకె వెంకటరెడ్డికి ఎలాంటి అవకాశం కల్పించలేదనే మనస్తాపంలో జంకె అనుచరుగణం ఉంది. ఈ నేపథ్యంలో వైసిపి జిల్లా అధ్యత పదవితో జిల్లా పగ్గాలను జంకె చేతుల్లో పెట్టడంతో జంకె శ్రేణుల్లో నూతనోత్సాహం నిండుకుంది. జంకె వెంకటరెడ్డి వైసిపి జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన విషయం తెలుసుకున్న జంకె శ్రేణులు, వైసిపి నాయకులు మార్కాపురంలోని జవహర్‌నగర్ కాలనీలో గల జంకె నివాసానికి చేరుకుని పూలమాలలతో జంకె వెంకటరెడ్డిని సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి వెన్నా హనుమారెడ్డి, పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి, వైసిపికి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

26న చలో రాజ్ భవన్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం



రైతు సంఘాల ఐక్య కార్యచరణ ఆధ్వర్యంలో ఈ నెల 26న చలో రాజ్ భవన్ కార్యక్రమాన్ని చేపట్ట నున్నట్లు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి వెంకట రామిరెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలు పండక, పెట్టుబడులు అధికమై నష్టపోయిన రైతాంగానికి ఆదుకోవాలని కోరారు. బ్యాంకు రుణాలను మాఫీ చేయాలన్నారు. నష్టపోయిన పంటలకు నష్టపరిహారం అందించాలన్నారు. వెలుగొండ ప్రాజెక్టుకు అధిక నిధులు కేటాయించి వేగంగా పూర్తి చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. చలో రాజ్ భవన్ కార్యక్రమంలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

'పేస్'లో డేటా సైన్స్‌పై వర్క్‌షాపు

టంగుటూరు : పేస్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు డేటా సైన్స్‌పై గురువారం వర్క్ షాపు నిర్వహించారు. ఈ వర్క్ షాప్ కు ప్రముఖ టిసిఎస్ కంపెనీలో డేటా ఇంజినీర్‌గా పనిచేస్తున్న జయరామ్ దేసిక్ రిసోర్స్ పర్సన్ గా వ్యవహరించారు. ఈ సందర్భంగా దేసిక్ మాట్లాడుతూ డేటా సైన్స్ ద్వారా పైతాన్ మరియు ఎస్ క్యూఎల్‌ను ఏ విధంగా ఉపయోగించాలో తెలియజేశారు. ఈ అంశంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చి వారితో కొన్ని దరఖాస్తులను రూపొందింపజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ పైతాన్ కెస్‌క్యూఎల్ రూపొందించడంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జివికె.మూర్తి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి పఠాన్ హుస్సేన్ బాషా, కో ఆర్డినేటర్లు టివి.సాయికష్ణ, వి.శ్రీహర్ష, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రగడ కోటయ్య విగ్రహ కమిటీ ఏర్పాటు

చీమకుర్తి : రాజ్యసభ మాజీ సభ్యులు, చేనేత బంధు దివంగత ప్రగడకోటయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. స్థానిక చేనేత సహకార పరపతి సంఘం కార్యాలయంలో అవ్వారు ఆదినారాయణ అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రగడ కోటయ్య విగ్రహాన్ని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా విగ్రహ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడి కొండా మోహనరావు, కార్యదర్శిగా సోమా శేషాద్రి, ఉపాధ్యక్షులుగా దోమల పుల్లయ్య, మర్రి లక్ష్మినారాయణ, దొంతు వెంకటరావు, హనుమంతరావు, నలమోలు హరిప్రసాదరావు, గోపవరపు చంద్ర, ఉప కార్యదర్శిగా పరాల శ్రీనివాసరావు, కోశాధికారిగా నూకల రాఘవ గజేంద్రకుమార్, ఉప కోశాధికారిగా గుద్దంటి శ్రీనివాసరావు, కార్యదర్శులుగా కోటాకిషోర్, నరసింహారావు, యాదగిరి నరసింహారావు, వి. ఆంజనేయులు, వాసి వెంకటేశ్వర్లు, కోటా రాములు ఎన్నికయ్యారు.



షేక్ ఖాదర్‌బాషా



ఎస్‌డి.గౌష్‌బాష

ఆవాజ్ మండల కమిటీ ఎన్నిక

పామూరు : ఆవాజ్ మండల నూతన కమిటీని ఏక్రగీవంగా ఎన్నుకున్నట్లు ఆవాజ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్‌డి. హనీఫ్ తెలిపారు. పప్పు ఎంకోబురావు మీటింగ్ హాలులో ఆవాజ్ మండల కమిటీ 12వ వార్డు మెంబరు షేక్ మస్తాన్ అధ్యక్షతన ఏన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్ ఖాదర్‌బాషా, కార్యదర్శి ఎస్‌డి. గౌస్‌బాషా, ఉపాధ్యక్షుడిగా షేక్ మస్తాన్, సహాయ కార్యదర్శి ఎస్‌డి.గఫూర్, సెక్రటరీగా ఎస్‌డి.రియాజ్, కోఆప్షన్ సభ్యులు షేక్ గులాం రసూల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మరో ఆరుగురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

దాతల సహకారంతో ఉన్నత స్థాయికి చేరుకోవాలి

జడ్‌పి ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తున్న జడ్‌పి ఛైర్‌పర్సన్

ప్రజాశక్తి-చీమకుర్తి

విద్యార్థులు దాతల సహకారంతో బాగా చదువుకొని ఉన్నతస్థాయికి చేరుకోవాలని జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బూచేపల్లి వెంకాయమ్మసుబ్బారెడ్డి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజనం పథకాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వారా ఇంటర్ విద్యార్థుల వార్షిక పరీక్షలు పూర్తయ్యే వరకు మధ్యాహ్న భోజనం అందించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్న సహయంలో విద్యార్థులు భోజనానికి ఇబ్బంది పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని ఆమె తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక నిధులు కేటాయించినట్లు తెలిపారు. తమ ట్రస్టు ద్వారా విద్యారంగ అభివృద్ధికి విశేష సహకారం అందిస్తున్నట్లు తెలిపారు.ఎంపిపి యద్దనపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ మధ్యాహ్న భోజనానికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు జడ్‌పి ఛైర్‌పర్సన్‌ను సత్కరించారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి వేమా శ్రీనివాసరావు, మండల వైసిపి కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, కళాశాల ప్రిన్సిపల్ కె ఆలీబాబు, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ బాపతువెంకటరెడ్డి, కౌన్సిలర్లు ఎస్‌కె ఖాజా, భీమనవెంకటరావు, ఉపాధ్యాయులు శివరామకృష్ణ, కోటయ్య, వెంకటేశ్వర్లు, అల్లా మాలిక్ పాల్గొన్నారు.

నత్తనడకన వెలుగొండ ప్రాజెక్టు పనులు




మాట్లాడుతున్న హనుమారెడ్డి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

సంవత్సరాలు గడుస్తున్నా, ప్రభుత్వాలు మారుతున్నా వెలిగొండ ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగుతున్నాయని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమారెడ్డి అన్నారు. గురువారం యర్రగొండపాలెంలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ రైతు సంఘం విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ 17 ఏళ్ల నాడు ప్రారంభించిన పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు 18 కిలోమీటర్ల సొరంగాలను ప్రభుత్వాలు మారుతున్నా సరియైన నిధులు కేటాయించకుండ సంవత్సరానికి ఒక కిలోమీటరు లెక్క త్రవ్వుతున్నారని ఆయన దుయ్యబట్టారు. ప్రాజెక్టుకు అవసరమైన నిధులను వెంటనే కేటాయించి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. . ముంపు గ్రామాల ప్రజలకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. 15 లక్షల ఎకరాలకు సాగునీరు 15 లక్షల మందికి తాగునీరు అందించే ఈ ప్రాజెక్టు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు దేవేండ్ల శ్రీనివాస్, చెన్నయ్య, కష్ణగౌడ్ పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు

వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి అశోక్‌బాబు



పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న వరికూటి

ప్రజాశక్తి-శింగరాయకొండ

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకం అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికుటి అశోక్ బాబు తెలిపారు. శింగరాయకొండ -1 సచివాలయ పరిధిలోని సుందర్ నగర్‌లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా శింగరాయకొండ సర్పంచి తాడిపర్తి వనజ ఆధ్వర్యంలో వరికూటి అశోక్ బాబుకు స్వాగతం పలికారు. అనంతరం అశోక్‌బాబు గడపగడపు తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బత్తుల అశోక్ కుమార్ రెడ్డి, ఎంపిపి కట్టా శోభారాణి, వైస్ ఎంపిపి సామంతుల రవికుమార్ రెడ్డి ,సర్పంచి తాడిపర్తి వనజ, ఎంపిడిఒ జమీఉల్లా , ఎంఇఒ శివ నారాయణ, దేవస్థానం ఛైర్మన్ పామర్తి మాధవరావు, వైసిపి నాయకులు షేక్ సలీం బాషా, ఎస్‌కె. పటేల్ రాజు,వెంకటేశ్వర్ రెడ్డి ,వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ యనమల మాధవి , పుట్టా వెంకట్రావు ,ఇండ్ల సుజాత,సవలం కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సీనియర్ నాయకులను ముఖ్యమంత్రి గుర్తించారు

వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి బొక్కిసం ఉపేంద్రచౌదరి



ఉపేంద్రచౌదరి

ప్రజాశక్తి-కొండపి

కొండపి నియోజకవర్గంలోని వైసిపి సీనియర్ నాయకులను ముఖ్యమంత్రి గుర్తించి కార్యకర్తల సమావేశాన్ని వాయిదా వేయడం హర్షణీయమని వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి, కొండపి సొసైటీ అధ్యక్షుడు బొక్కిసం ఉపేంద్రచౌదరి తెలిపారు. స్థానిక వైసిపి కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఉపేంద్రచౌదరి మాట్లాడారు. కొండపి నియోజక వర్గంలోని పార్టీ కలహాలు, సమస్యలపై చర్చించేందుకు నియోజకవర్గానికి 50 మంది కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించేందుకు ముఖ్యమంత్రి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 50 మంది కార్యకర్తల ఎంపిక విషయంలో సీనియర్ నాయకులను ప్రాధాన్యత ఇవ్వలేదని వైసిపి రాష్ట్ర నాయకులు పుట్టా ప్రతాప్‌రెడ్డి దృష్టికి స్థానిక నాయకులు తీసుకెళ్లినట్లు తెలిపారు. స్పందించిన పుట్టా ప్రతాప్‌రెడ్డి ఈ విషయాన్ని సిఎం దృష్టికి తీసుకెళ్లి సమీక్షా సమా వేశాన్ని నిలుపుదల చేసినట్లు తెలిపారు. అయితే ఈ విషయాన్ని బయట పెట్టకుండా తుపాను కారణంగా సమావేశం వాయిదా వేసినట్లు వైసిపి కొండపి నియోజక ఇన్‌ఛార్జి చెబుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు బొక్కిసం సుబ్బారావు, దివి శ్రీను, కొయవారిపాలెం కృష్ణ,దుగ్గిరాల వెంకటేశ్వర్లు, రాయుడు, గొర్రెడ్డి రమణారెడ్డి, మామిళ్లపల్లి సింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడకు నివాళి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

బ్రిటీష్ పాలకులను గడగడలాడించిన స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 216వ జయంతి వేడుకలను యర్రగొండపాలెంలోని గ్రామ పంచాయితీ కార్యాలయ ఆవరణలో రెడ్డి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా రెడ్డి సంక్షేమ సేవా సంఘం గౌరవాధ్యక్షుడు, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, అధ్యక్షుడు చిట్టేల వెంగళరెడ్డిలు మాట్లాడుతూ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి బ్రిటీష్ వారిపై తిరుగుబాటు చేసిన తొలి స్వాతంత్ర్య సమర యోధుడుగా గుర్తింపు పొందారన్నారు. ఆయన పోరాట స్పూర్తి భావితరాలకు ఆదర్శ మన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి ఆవుల రమణారెడ్డి, కోశాధికారి కందుల నారాయణరెడ్డి, నర్రెడ్డి వెంకటరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ఒబుల్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, అంకిరెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

యర్రగొండపాలెం : యర్రగొండపాలెం పంచాయితీ 6వ వార్డు మెంబర్ గోరంట్ల రత్తమ్మ భర్త, మాజీ వార్డు మెంబర్ గోరంట్ల మస్తాన్ పల్నాడు జిల్లా నరసరావుపేటలోని ప్రైవేటు వైద్యశాలలో తలకు ఆపరేషన్ చేయించుకున్నారు. ఈ సందర్భంగా యర్రగొండపాలెం సర్పంచి రామావత్ అరుణాబాయి, వార్డు మెంబర్లు మస్తాన్‌ను గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా సర్పంచి రామావత్ అరుణాబాయి మస్తాన్ వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 10 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. వార్డు మెంబర్లు కూడా మస్తాన్‌కు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వనిపెంట గురువారెడ్డి, వార్డు మెంబర్లు షేక్ మహబూబ్ సుభాని, షేక్ ఇస్మాయిల్, సయ్యద్ ఆయేషా ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

జీవో 52ను రద్దు చేయాలని వినతి

యర్రగొండపాలెం : బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే విధంగా విడుదల చేసిన జిఒనెం. 52ను వెంటనే రద్దు చేయాలని గురువారం యర్రగొండపాలెం నియోజకవర్గ లంబాడి హక్కుల సంఘం ఆధ్వర్యంలో గిరిజనులు పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ముందుగా పుల్లలచెరువు సెంటర్ నుండి త్రిపురంతకం సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లంబాడి హక్కుల సంఘం నాయకులు మాట్లాడుతూ బిసిలో ఉన్న ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చి మాకు అన్యాయం చేస్తున్నారని గిరిజనుల జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ 12 శాతం పెంచాలని వారు డిమాండ్ చేశారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్ రవీంద్రారెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం సర్పంచ్ రామావత్ అరుణబాయి, మంత్రు నాయక్, బద్దె నాయక్, సేవ్యా నాయక్, లక్ష్మా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాల్లో తనిఖీ

పెద్దదోర్నాల : మండల పరిధిలోని యడవల్లి, చిన్నదోర్నాల రైతు భరోసా కేంద్రాలను ఎ. డి.జవహర్‌లాల్‌నాయక్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖరీఫ్-2022లో ఈ క్రాప్ నమోదు చేసుకున్న రైతులకు ఈ క్రాప్ నమోదు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం మినుము, ప్రత్తి, మిరప పంటలలో పురుగులు, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సి చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఎం.రాజేంద్రప్రసాద్, గ్రామ ఉద్యాన సహాయకులు పి.సంధ్యా బాయి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

డాక్టర్ అనూషకు సన్మానం

ప్రజాశక్తి-కొండపి

వైఎస్ఆర్ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోనే ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఐదుగురు డాక్టర్లను ఎంపిక చేశారు. అందులో భాగంగా కొండపి మండలం పెట్లూరు పిహెచ్‌సి వైద్యురాలు డాక్టర్ అనూష ఉత్తమ వైద్యాధికారిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ అనూషను కలెక్టర్ దినేష్‌కుమార్ చేతుల మీదుగా గురువారం శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా కొండపి ప్రభుత్వ వైద్యశాల వైద్యులు, సిబ్బంది అనూషా అభినందనలు తెలిపారు.

పంచాయతీ దుకాణాలు స్వాధీనం

ప్రజాశక్తి - కురిచేడు

కురిచేడులోని శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానాన్ని ఆనుకొని ఉన్న 8 దుకాణాలను కోర్టు ఉత్తర్వుల మేరకు పంచాయతీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి షేక్ చాంద్‌బి గురువారం తెలిపారు. ఇప్పటి వరకూ ఆ దుకాణాలు అమ్మవారి దేవస్థానం ఆధీనంలో ఉన్నాయని తెలిపారు. గ్రామానికిచెందిన కొందరు ఆ దుకాణాలు గ్రామ కంఠంలో ఉన్నాయని, అందువల్ల పంచాయతీకి సంబంధించినవని కోర్టు ద్వారా ఉత్తర్వులు తెచ్చినట్లు తెలిపారు. త్వరలో ఆ దుకాణాలను ఖాళీ చేయిస్తామని పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

బకాయి జీతాలు చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి - కురిచేడు

స్వచ్ఛభారత్ కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల గౌరవాధ్యక్షుడు సందు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మండల పరిధిలోని స్వచ్ఛభారత్ కార్మికులకు గత 9 నెలల నుంచి జీతాలు ఇవ్వలేదని, వారు అనేక ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. అనంతరం ఎంపిడిఒకు వినతి పత్రం అందజేశారు. పారిశుధ్య కార్మికులకు బకాయిలు ఇవ్వాలని ట్రెజరీలకు బిల్లులు పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జార్జి, గురవయ్య, శ్యాంసన్, బాల గురవయ్య, కోటేశు, దేవదాసు, సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధే సిఎం లక్ష్యం

ప్రజాశక్తి-పెద్దారవీడు

విద్యాభివృద్ధి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు సర్పంచుల సంఘం మండల ఉపాధ్యక్షుడు, సుంకేసుల సర్పంచి గుడ్డిపోగు రమేష్ తెలిపారు. మండల పరిధిలోని సుంకేసుల మండల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నం భోజనాన్ని గురువారం పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సర్పంచి, సచివాలయ సిబ్బంది, పిఎంసి ఛైర్మన్లు భోజనం చేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల్లో విద్య బోధన అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణరెడ్డి, కొర్ర శీనునాయక్, విద్యాకమిటీ ఛైర్మన్లు దుగ్గి చిన్ననారపురెడ్డి, కొల్లే పోలురాజు, వార్డు మెంబర్ మండ్ల పెద్దగాలిం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఫారెస్టు కార్యాలయం ఎదుట బైఠాయించిన చెంచులు

ఫారెస్టు కార్యాలయం ఎదుట చెంచుగూడెం వాసుల బైఠాయింపు

పెద్దదోర్నాల : ఫారెస్టు అధికారులు అదుపులోకి తీసుకున్న తమ వారి ఆచూకీ తెలపాలంటూ మండల పరిధిలోని అయ్యన్నకుంట చెంచు గూడెం వాసులు దోర్నాలలోని అటవీశాఖ కార్యాలయం ఎదుట గురువారం బైఠాయించారు. ఈ సందర్భంగా చెంచు గిరిజనులు మాట్లాడుతూ వారం రోజుల క్రితం నల్లమల అడవి ప్రాంతంలోని దోర్నాల-శ్రీశైలం అటవీ ప్రాంతంలోని అయ్యన్నకుంట చెంచు గూడెం సమీపంలో వెలుగుబంటి అనుమానస్పద స్థితిలో మృతి చెందినట్లు తెలిపారు.ఈ ఘటనపై కొర్రపోలు ఫారెస్టు రేంజర్ ప్రసన్నజ్యోతి అయ్యన్న కుంటకు వచ్చి గిరిజనులను విచారించినట్లు తెలిపారు. ఆ సమయంలో ఐదుగురు తాము ఎలుగుబంటి గోర్లు తీశామని ఒప్పుకోవడంతో వారిని అటవీశాఖ కార్యాలయానికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అధికారులు ఐదుగురిని తీసుకెళ్లితే ఒక్కరు మాత్రమే అక్కడ ఉన్నట్లు తెలిపారు.

నలుగురు పరారీ అయ్యారు
ప్రసన్నజ్యోతి, కొర్రపోలు ఫారెస్టు రేంజర్

మృతిచెందిన ఎలుగు బంటి గోళ్లను తీశామని ఒప్పుకున్న ఐదుగురి విచారణ నిమిత్తం ఫారెస్టు కార్యాలయానికి తీసుకెళ్లగా నలుగురు అధికారుల కన్నుగప్పి గోడ దూకి పరారీ అయినట్లు కొర్రపోలు ఫారెస్టు రేంజర్ ప్రసన్న జ్యోతి తెలిపారు. మరో వ్యక్తిని కోర్టులో హాజరుపరిచినట్లు ఫారెస్టు రేంజర్ తెలిపారు.

మెరుగైన సేవలందించాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-రేపల్లె

సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా సిబ్బంది కృషి చేయాలని ఎంపిడిఒ కె సాయి మల్లికార్జునరావు ఆదేశించారు. గురువారం మండలంలోని కారుమూరు, పిరట్లలంక గ్రామ సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయం ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. ఇప్పటివరకు ఎన్ని అర్జీలు వచ్చాయి, వాటిలో ఎన్ని పరిష్కరించారనే వివరాలను సచివాలయ ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కారుమూరి సర్పంచ్, పిరాటలంక సర్పంచ్ పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం బస్సు నడపండి

ప్రజాశక్తి-దరిశి

మండలంలోని చందలూరు జిల్లాపరిషత్ హైస్కూల్ విద్యార్థుల కోసం ఆర్‌టిసి బస్సును నడపాలని ఎంపిటిసి సంఘం జిల్లా అధ్యక్షుడు, బసిరెడ్డిపల్లి ఎంపిటిసి బండి గోపాల్ అన్నారు. గురువారం పొదిలి ఆర్‌టిసి డిపో మేనేజరు రాజారావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరిశి నుండి దొనకొండ వెళ్లే దారిలో 40 మంది చందలూరు హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని బండి గోపాల్ కోరారు. డిపో మేనేజరు సోమవారం నుండి పరిశీలించి బస్సును ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.

జాతీయ స్థాయి పోటీలకు మైనంపాడు విద్యార్థి

ప్రజాశక్తి-సంతనూతలపాడు రూరల్

మండల పరిధిలోని మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి ఆకుల భవ్యశ్రీ జాతీయస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ కె. వనజ, పిఇటి రవికుమార్ తెలిపారు. ఈనెల 25 నుంచి 29 వరకూ కర్నూలులో నిర్వహిస్తున్న జాతీయస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున భవశ్రీ పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా భవశ్రీని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాబుసుభాని, జిల్లా సాఫ్ట్ బాల్ సెక్రెటరీ బొడ్డు సుబ్బారావు, విద్యా కమిటీ చైర్మన్ ఆకుల బ్రహ్మయ్య, ఉపాధ్యాయులు ఇందిర పాఠశాల సిబ్బంది గురువారం అభినందించారు.

ఎఫ్‌పిఒను బలోపేతం చేయాలి

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

శనగ రైతుల ఉత్పత్తిదారుల సంఘాన్ని(ఎఫ్‌పిఒ)ను బలోపేతం చేసుకోవాలని నాబార్డు డిజిఎం పన్నీకర్ తెలిపారు. శనగ రైతులకు సంఘం ఉపయోగాలపై గురువారం అవగాహన కల్పించారు. నాబార్డు ద్వారా 65శాతం సబ్సిడీపై ఎరువులు, పురుగు మందులు సంఘానికి అందజేస్తున్నట్లు తెలిపారు. ట్రాన్స్ పోర్ట్ గోడౌన్‌కు రూ.5లక్షలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాబార్డు డిడిఎం వెంకటరమణ, ఎఫ్‌పిఒ చైర్మన్ జె.జయంతిబాబు,సిఇఒ నాగలక్ష్మి, అమ్మనబ్రోలు సొసైటీ చైర్మన్ కోయి హనుమయ్య, పి.వెంకట్రావు పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి

ప్రజాశక్తి-దరిశి

వరిలో మేలైన యాజమాన్య పద్ధతులు అవలంబించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బొట్లపాలెం గ్రామంలోని గ్రామ సచివాలయం నందు రైతులకు వరిలో మేలైన యాజమాన్య పద్ధతులు, ఉత్పత్తులతో పాటు ధృవీకరణపత్రాలు అందించే కార్యక్రమం మండల వ్యవసాయాధికారి బాలక్రిష్ణనాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు సేంద్రీయ ఎరువులను వాడి భూమిని సారవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ అర్జున్ నాయక్ జిల్లా వనరుల కేంద్రం ఎడిఎ ప్రభాకర్, కెవికె శాస్త్రవేత్త రాజేష్ చౌదరి, విస్తరణ అధికారి వెంకట్రావు, వ్యవసాయ సహాయకులు బాజీ, ఎఫర్ట్ సంస్థ అదినేత సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమావేశం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

స్థానిక మండల విద్యావనరుల కార్యాలయంలో ఉపాధ్యాయులకు ఎంఇఒ బి.మస్తాన్‌నాయక్ అధ్యక్షతన గురువారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంఇఒ బి.మస్తాన్‌నాయక్ మాట్లాడుతూ నాడు-నేడు కార్యక్రమం, జగనన్న విద్య కానుకలో మండలంలో 100 శాతం బయోమెట్రిక్ చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం దర్శనం పొలయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ పంపుసెట్ల చోరీలను అరికట్టండి

ప్రజాశక్తి-పంగులూరు

వ్యవసాయ పంట పొలాల్లో జరిగే సోలార్ పంపుసెట్ల దొంగతనాలను అరికట్టాలని రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు పోలీసులను కోరారు. ఈ మేరకు రేణింగవరం పోలీస్ స్టేషన్‌లో, గురువారం ఎఎస్ఐ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాపట్ల జిల్లా రైతు సంఘం కార్యదర్శి తలపనేని రామారావు మాట్లాడుతూ గత మూడేళ్లుగా మండలంలోని అనేక సోలార్ పంప్ సెట్టు దొంగతనాలకు గురయ్యాయని, అనేక మంది రైతులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదన్నారు. మండలంలో సుమారు 500 సోలార్ పంపుసెట్లు ఉండగా, వాటిలో సగానికి పైగా దొంగిలించబడి పడ్డాయని అన్నారు. బుధవారం రాత్రి కూడా, పంగులూరు గ్రామంలో మూడు సోలార్ సెట్ల వైర్లు దొంగిలించారని రామారావు అన్నారు. ఇటీవల రేణింగవరం పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ వకుల్ జిందాల్, సోలార్ దొంగలపై ప్రత్యేక నిఘా పెడుతున్నామని ప్రకటించినా, పోలీసులలో మాత్రం



ఏఎస్ఐకు వినతిపత్రం ఇస్తున్న రైతులు, రైతు సంఘం నాయకులు

కదలికలేదని రామారావు అన్నారు. . కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాయిని వినోద్ బాబు మాట్లాడుతూ మండలంలో సోలార్ దొంగతనాలు రోజురోజుకు ఎక్కువైపోతున్నాయని, వీటిని అరికట్టడంలో పోలీసులు విఫలమవుతున్నారని అన్నారు. తక్షణమే చర్యలు తీసుకొని ఈ దొంగతనాలను అరికట్టి, రైతులను, వ్యవసాయాన్ని, కాపాడాలని కోరారు. అనంతరం ఏఎస్ఐ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు బాచిన ఆంజనేయులు, తలపనేని స్వామి, శానంపూడి అశోక్, గొరంట్ల శ్రీనివాసులు, ఫణిదపు వెంకటేశ్వర్లు, గొట్టిపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్య స్థాపనే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బేస్తవారిపేట

మహాత్మా గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్య స్థాపనే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్ రెడ్డి గ్రామ, వార్డు సచివాలయాలు, వాలంటీర్ వ్యవస్థలను ప్రవేశ పెట్టారని ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. గురువారం బేస్తవారిపేటలో 67వ రోజు బేస్తవారిపేట1 సచివాలయ పరిధిలో రెడ్డి నగర్, తహశీల్దార్ కార్యాలయం రోడ్డు, ఎండిఒ ఆఫీస్ రోడ్డు, వాల్మీకి నగర్, నీలం సంజీవరెడ్డి వీధుల్లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నా పాల్గొన్నారు. ముందుగా వైసిపి నాయకులు, ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నా ప్రతి వీధిలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి మూడేళ్ళ పాలనలో అందించిన సంక్షేమ బుక్‌లను అందించడం జరిగింది. ఈసందర్భంగా స్థానికంగా ఉన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకుని, వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా

ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నా మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకున్నా, ప్రజలకు ఇచ్చిన మాటకోసం చెప్పిన ప్రతి హామీ నెరవేర్చిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకునే విధంగా గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జడ్‌పిటిసిలు ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, వైసిపి నాయకులు, పాల్గొన్నారు.

రేపల్లె అభివృద్ధే లక్ష్యంగా కృషి : వైస్ ఎంపిపి

ప్రజాశక్తి-రేపల్లె

రేపల్లె మండలాన్ని అభివృద్ధి చేసి ప్రగతి పథంలో నడిపించడానికి నిరంతరం పని చేస్తున్నామని రేపల్లె మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు (వైస్ ఎంపిపి) రావు నెహ్రూలక్ష్మీ ప్రభాకర్ రావు దంపతులు చెప్పారు. రేపల్లె మండలం పేటేరు గ్రామంలోని తమ స్వగృహంలో ఆమె భర్త ప్రభాకర్‌రావుతో కలిసి 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపిపి రావు నెహ్రూలక్ష్మీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు, మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావు ఆశీస్సులతో అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తున్నానని చెప్పారు. రేపల్లె మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రజలకు పూర్తిస్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చేస్తున్నామని చెప్పారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు. రేపల్లె మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలకు కనీస మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. తాగునీటి సమస్యలపై ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుని ప్రజలకు రక్షిత మంచినీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటానని



వైస్ ఎంపిపి రావు నెహ్రూలక్ష్మీ, ప్రభాకరరావు దంపతులు

చెప్పారు. సిఎం జగన్ ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలు అన్ని తరగతుల ప్రజలకు ఎంతో మేలు చేకూరుస్తున్నాయని అన్నారు. రేపల్లె మండలంలోని అన్ని గ్రామాల్లోని వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధుల సహాయ సహకారాలతో రేపల్లె మండలాన్ని జిల్లాలోనే ఆదర్శ మండలంగా తీర్చిదిద్దటానికి తాను శాయశక్తులా కృషి చేస్తానని పేర్కొన్నారు. తన ఎదుగుదలకు తోడ్పాటు నందించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

శివాలయంలో అన్నదానం

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి శివాలయంలో సకల మాల ధారణ స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గురువారం స్థానిక శివాలయంలో మండల ఇన్‌ఛార్జ్ ఆర్‌వి కిలారి సుబ్బారావు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని తహశీల్దార్ డి భాగ్యలక్ష్మి ప్రారంభించారు. కిలారి సుబ్బారావు కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గురుస్వాములు దేవస్థానం ఛైర్మన్ యక్కలి శేషగిరిరావు, గొలమారి చెన్నారెడ్డి, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది, సకల మాల ధారణ స్వాములు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి-కొనకనమిట్ల

సమాజంలో సామాజిక రుగ్మతగా ఉన్న బాల్యవివాహాలను అడ్డుకోవాలని తహశీల్దార్ కెవిఆర్‌వి ప్రసాద రావుఅన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బాలికా ప్రకాశం విద్య ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చిన్న వయస్సులో బాలికలకు వివాహం చేయడం వల్ల సమాజానికి అనేక అనర్ధాలు కలుగు తాయన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ సుధామాధురి , ఎంపిపి మోరబోయిన మురళీకృష్ణ, జిల్లా కోఆర్డినేటర్ ఎన్ కుమార్, ఎంపిడిఒ రావూరి జనార్దన్, కెకెమిట్ల సర్పంచి శిగినం లక్ష్మీతిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి : ఎఒ

ప్రజాశక్తి-పంగులూరు

కొత్తగా పొలం పాస్ పుస్తకాలు పొందిన రైతులు, వైఎస్ఆర్ రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని, మండల వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారెడ్డి కోరారు. మండలంలోని కొండమూరు గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో గురువారం జరిగిన గ్రామ సభలో ఆయన పాల్గొని రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన సున్నా వడ్డీ పంట రుణాల లబ్ధిదారుల లిస్టును చదివి వినిపించారు. ఈ క్రాప్ నమోదు చేసిన రైతులకు, రశీదులను అందజేశారు. సున్నా వడ్డీ పంట రుణాల అర్హత ఉండి, లబ్ధిదారుల జాబితాలో పేరు లేకపోతే, రైతు భరోసా కేంద్రంలోతెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎవి రమణమూర్తి, గ్రామ వ్యవసాయ సహాయకుడు జాగర్లమూడి దినేష్ రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయ భూముల తనిఖీ

ప్రజాశక్తి-పొదిలి

వ్యవసాయ భూముల వినియోగంపై భారత ప్రభుత్వ సంస్థ - జాతీయ గణాంక శాఖ, నెల్లూరు ఉప క్షేత్రీయ కార్యాలయం సీనియర్ గణాంక అధికారులు మండలంలోని పలుగ్రామాలలో సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య ప్రణాళిక అధికారి టి రామకష్ణ, గణాంక అధికారి రవికుమార్, మండల వ్యవసాయ అధికారి ఎస్‌కె జైనులాబ్దీన్ల ఆధ్వర్యంలో సర్వేలు నిర్వహించారు. పొదిలి గ్రామములో వ్యవసాయ స్థలాలను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉప గణాంక అధికారి శివకుమార్, ప్రసాద్ గార్లు, సహాయ గణాంక అధికారి ప్రసన్న, పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-పొదిలి

మినుము, బొబ్బర, పెసర పంటలను ఆరంచు పురుగులు, తెగుళ్ళ నివారణకు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్‌కె జైనులాబ్దీన్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని మూగచింతల రైతు భరోసా కేంద్రాల పరిధిలోని పంటలను పరిశీలించారు. పొగాకు లద్దెపురుగు, తెల్లదోమ, తామర పురుగు, మారుకామచ్చల పురుగు సోకిన సందర్భంగా వాటి లక్షణాలు, నివారణ చర్యలు వివరించారు. బూడిద తెగులు, సీతాఫలం తెగులు, పల్లాకు తెగుళ్ల నివారణకు యాజమాన్యం చర్యలు వివరించారు.

అన్నా రాంబాబు పరామర్శ

బేస్తవారిపేట : మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ బషీర్ కుమారుడు కరీముల్లా రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు . గురువారం బెస్తవారిపేటలో జరిగిన కరిముల్లా అంత్యక్రియలలో ఎమ్మెల్యే అన్నా పాల్గొని మతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. షేక్ బషీర్‌కు సానుభూతిని తెలియజేశారు.

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ

ప్రజాశక్తి-సంతనూతలపాడు రూరల్

స్థానిక జడ్‌పి హైస్కూల్ పాఠశాల పూర్వ విద్యార్థి కంకనంపాటి మోహనరావు తన తల్లిదండ్రులు జాలమ్మ, వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం జడ్‌పిటిసి దుంపా రమణమ్మ చేతుల మీదుగా పాఠశాలకు ప్రింటర్ కం స్కానర్‌ను గురువారం అందజేశారు.ఈ కార్యక్ర మంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న మున్సిపల్ కార్మికులు

కాంట్రాక్టు ఉద్యోగికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పొదిలి

తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న కాంట్రాక్టు ఉద్యోగికి సహ ఉద్యోగులు ఆర్థిక సాయం అందించారు. నగర పంచాయతీ కార్యాలయంలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్న జిలానీ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. జిలానీ వైద్య ఖర్చుల నిమిత్తం తన తోటి పనిచేసే ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది అతనిని స్వగృహంలో కలిసి రూ. 14800ల నగదును అందజేశారు.

ప్రతి ఒక్కరూ

ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలి

డిఆర్‌డిఎ పీడీ బాబూరావు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.బాబూరావు పేర్కొన్నారు. స్థానిక బచ్చల బాలయ్య కళ్యాణమండపంలో గురువారం జిల్లా స్థాయి జాతీయ సమగ్ర అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి లెడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ యుగంధర్ రెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా డిఆర్‌డిఎ పీడీ మాట్లాడుతూ సురక్షితమైన బ్యాంకింగ్ విధానాన్ని అలవాటు చేసుకోవాలని మరియు డిజిటల్ పేమెంట్స్ చేస్తూ సైబర్ నేరాలు గురి కాకుండా తప్పించుకోవాలన్నారు. అంబుడ్స్‌మెన్-2021 వన్ నేషన్ వన్ అంబుడ్స్ మెన్ అంశాలు వివరించారు. కెనరా బ్యాంక్ ఆర్‌ఎం బిఎన్‌ఎం మారుత శశిధర్ బ్యాంకులో ఖాతాల రకాలు, బ్యాంక్ ఖాతా నిర్వహణ, రుణాలు ఏవిధంగా తీసుకోవాలని వాటిని ఏవిధంగా సద్వినియోగం చేసుకోవాలో తెలియజేశారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్‌ఎం అరుణ సవిత మాట్లాడుతూ



మాట్లాడుతున్న పీడీ బాబూరావు

బ్యాంకును సరిగా ఉపయోగించుకుంటే ఎన్నో పొదుపులు చేయవచ్చని, అవసరాలకి తక్కువ వడ్డీతో రుణాలు తీసుకొని ఆర్థికంగా ఎదగ వచ్చని సూచించారు. అనంతరం ఏ.పి.జి.బి ఆర్‌ఎం హేమలత, పిడిసిసి బ్యాంకు డిజిఎం వేణుగోపాల్, ఐసిఐసిఐ బ్యాంక్ ఆర్‌ఎం, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ యుగంధర్‌రెడ్డి ప్రసంగించారు. కార్యక్రమంలో ఎస్.బి.ఐ ఆర్ సుబ్రహ్మణ్యం, ఐసిఐసిఐ బ్యాంక్ ఆర్‌ఎం చిరంజీవి, జిల్లాలోని అన్ని బ్యాంకుల అధికారులు, స్వయం సహాయక మహిళలు పాల్గొన్నారు.

బాపట్ల జిల్లా సముద్రతీరంలో

ప్రయోగాత్మకంగా మడ అడవుల పెంపకం

డ్వామా పీడీ శంకర్‌నాయక్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

సముద్రపు అలల నుంచి తీరం కోతకు గురికాకుండా చూడటంతో పాటు ప్రకృతి సంరక్షణ కోసం బాపట్ల జిల్లా సముద్రతీరంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (డ్వామా) ద్వారా మడ అడవుల పెంపకం చేపడుతున్నట్లు ప్రాజెక్టు డైరెక్టర్ శంకర్‌నాయక్ తెలిపారు. ఈ నెలలో ఇండోనేషియాలోని బాలిలో జరిగిన జి20 సమ్మిట్‌లో ప్రకృతి సంరక్షణ చర్యల్లో భాగంగా మడ అడవుల పెంపకం గురించి జి20 సమ్మిట్‌లోని ప్రపంచ దేశాలు నిర్ణయం తీసుకున్నాయన్నారు. సముద్రతీరం ఉన్న అన్ని దేశాల్లో మడ అడవులు పెంచాలని నిర్ణయించారని పేర్కొన్నారు. ఈ క్రమంలో బాపట్ల జిల్లాలోని సముద్రతీరం మడ అడవుల పెంపకానికి అనువుగా ఉన్న నేపథ్యంలో నిజాంపట్నం, కర్లపాలెం, బాపట్ల,



మడ అడవుల పరిశీలన కోసం బోటులో పర్యటిస్తున్న డ్వామా పీడీ శంకర్ నాయక్

రేపల్లె, చినగంజాం ప్రాంతాల లో వీటి పెంపకం కోసం శ్రీకారం చుట్టారు. ముందుగా జిల్లాలోని ఐదు హెక్టార్లలో మడ అడవులు ప్రయోగాత్మకంగా పెంచి అనంతరం జిల్లా తీరంలో అనువైన ప్రాంతం అంతా వీటి పెంపకం చేపట్టనున్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యులు

26, 27 తేదీలలో

డయాబెటిస్ రాష్ట్రస్థాయి సమావేశం

- ఒంగోలులో నిర్వహణ
- ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి డాక్టర్ కె.సీతారామయ్య వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ డయాబెటిక్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సమావేశాలు ఒంగోలు ఏ1 కన్వెన్షన్ హాలులో ఈ నెల 26, 27 తేదీలలో నిర్వహిస్తున్నట్లు ఎపిడిఎఫ్ కార్యనిర్వాహక కమిటీ కార్యదర్శి డాక్టర్ కె.సీతారామయ్య తెలిపారు. స్థానిక ఐఎంఎ హాలులో గురువారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో డాక్టర్ కె.సీతారామయ్య మాట్లాడుతూ ఎపిడిఎఫ్ 31వ వార్షిక సమావేశం ఒంగోలులో ఈ నెల 26, 27 తేదీలలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. డయాబెటిక్‌లో వస్తున్న సరికొత్త వైద్య విధానాలు, పరికరాలపై డాక్టర్లకు అవగాహన కల్పించటమే వార్షిక సమావేశం ప్రధాన ఉద్దేశమన్నారు. రాష్ట్రస్థాయి సమావేశంలో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు నుంచి స్టేట్ ఆఫీస్ బేరర్స్, వైద్యులు పాల్గొంటారన్నారు. అనంతరం వార్షిక సమావేశం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఆర్గనైజింగ్ కమిటీ గౌరవాధ్యక్షులు డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి డాక్టర్ పి.అరుణారెడ్డి, కోశాధికారి డాక్టర్ ఎం.కృష్ణారావు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు డాక్టర్ బి.సురేష్‌బాబు, డాక్టర్ ఎస్.సునీత, డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

దళితులపై దాడులను అరికట్టాలి

- కెవిపిఎస్ జిల్లా మహాసభలలో తీర్మానం
- జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా రాజు, రఘురామ్ ఎన్నిక

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కులవివక్షతను నిర్మూలించాలని, దళితులపై దాడులు, హత్యలు, హత్యచారాలను అరికట్టాలని కెవిపిఎస్ జిల్లా మహాసభలలో తీర్మానించారు. కెవిపిఎస్ జిల్లా 5వ మహాసభలు ఒంగోలు నగరంలో ఉత్సాహభరితంగా జరిగాయి. ఈ మహాసభలలో మొత్తం 20 తీర్మానాలను ఆమోదించారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ సాధన నిధులు సక్రమంగా దళితవాడలకు ఖర్చుపెట్టాలని, ఖర్చు పెట్టిన పనులపై శ్వేతపత్రం విడుదల చేయాలని, అమలు చేయని అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. శ్మశానాలు లేని దళితవాడలకు 1235 జి.ఓ ప్రకారం రెండు ఎకరాల భూమిని ఇవ్వాలని, ఎస్సీ కార్పొరేషన్ రుణాలు ఇవ్వాలని తీర్మానించారు. అర్హులకు ఇళ్ళ స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టించాలని, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని తీర్మానించారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, కులాంతర వివాహాలు చేసుకున్న వారికి ప్రోత్సాహకాలు ఇవ్వాలన్నారు. డప్పు కళాకారులకు ప్రభుత్వం గుర్తింపుకార్డులు, పింఛన్లు, డప్పులు, గజ్జలు ఇవ్వాలని, జస్టిస్ పున్నయ్య కమిషన్ అమలు చేయాలని తీర్మానించారు. హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయాలని తీర్మానించారు. అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలని, విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని తీర్మానించారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌ను బలోపేతం చేయాలన్నారు. దళిత మహిళల సమస్యలు పరిష్కరించాలని, దాడులు, హత్యలు, అత్యచారాలు అరికట్టాలని తీర్మానించారు. దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని, ప్రమోషన్స్‌లో రిజర్వేషన్లు అమలు చేయాలని తీర్మానించారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం పటిష్టంగా అమలుచేయాలని, దళిత భూములు బలవంతంగా ఆక్రమించుకోవడం ఆపాలని తీర్మానించారు. ప్రభుత్వ భూములు పేదలకు పంచాలని, కోనేరు రంగారావు సిఫార్సులు అమలు చేయాలని తీర్మానించారు. భూమి కొనుగోలు పథకం ద్వారా అర్హులైన పేదలకు భూమి కొనుగోలు చేసి ఇవ్వాలని బ్యాంక్ తనఖాలో ఉన్న (ఎల్.పి.ఎస్) భూములు దళితులకు తిరిగి ఇవ్వాలని తీర్మానించారు.



రాజు



రఘురామ్

కెవిపిఎస్ జిల్లా కమిటీ ఎన్నిక

కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా జవ్వాజి రాజు, బి.రఘురామ్ ఎన్నికయ్యారు. 9 మంది ఆఫీస్ బేరర్స్ 27 మందితో కొత్త కమిటీని ఎన్నుకున్నారు. ఆఫీస్ బేరర్స్‌గా అట్లూరి రాఘవులు, చీకటి శ్రీనివాసరావు, వేశపోగు మోజేష్, తొట్టెంపూడి రామారావు, అత్తంటి శ్రీనివాసరావు, కాలే మల్లికార్జునరావు, బక్కా జేసురత్నం ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సభ్యులుగా రావూరు శ్రీను, గౌడపేరు సుబ్బారావు, ప్రేమల బాబురావు, జజ్జర సంజీవరావు, గుంటూరి విక్టర్, అరెం నాగమల్లేశ్వరి, కొమ్ము బ్రహ్మయ్య, అంగలకుర్తి సూరిబాబు, కత్తి యోబు, పరదేశి రాజశేఖర్, కోలనేడి నరేష్, మరో ఏడుగురు కోఆప్షన్ సభ్యులను ఎన్నుకున్నారు.



సంయుక్త కార్యదర్శికి అర్జీ ఇస్తున్న మాగుంట

పొగాకు రైతుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కేంద్ర వాణిజ్యమంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి ఎం.బాలాజీని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కోరారు. గురువారం డిల్లీలో ఆయన కార్యాలయంలో కలిసిన ఎంపీ మాగుంట మాట్లాడుతూ పండు గుల్ల పొగాకును మామూలు కోటాతో కలపకుండా వేలం ప్లాట్ ఫారాలలో సాధారణ చార్జీలతో అమ్ముటకు అనుమతించాలన్నారు. స్పందించిన సంయుక్త కార్యదర్శి యం.బాలాజీ మాట్లాడుతూ పొగాకు బోర్డు చైర్మన్‌తో సంప్రదించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

26న మాగుంట సుబ్బరామరెడ్డి జయంతి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు మాజీ ఎంపీ, కీర్తిశేషులు మాగుంట సుబ్బరామరెడ్డి 75వ జయంతి సందర్భంగా ఈ నెల 26న ఉదయం 10 గంటలకు రాంనగర్ 2 వ లైనులోని మాగుంట కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పూలమాల వేసి, నివాళులర్పించనున్నారు. అనంతరం నగరంలోని సుబ్బరామరెడ్డి విగ్రహాలకు నివాళులర్పిస్తారు. కార్యక్రమంలో కీర్తిశేషులు మాగుంట సుబ్బరామరెడ్డి మనుమడు మాగుంట సుబ్బరామిరెడ్డి (జూనియర్) పాల్గొననున్నారు. ఈ కార్యక్రమాన్ని మాగుంట అభిమానులు జయప్రదం చేయాలని ఎంపీ మాగుంట ఒక ప్రకటనలో కోరారు.

షాదీఖానా పనులు పరిశీలన

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

స్థానిక ఊరచెరువులోని ముస్లిముల షాదీఖానా నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, వైసిపి యువ నాయకులు బాలినేని ప్రణీత్‌రెడ్డి అధికారులకు సూచించారు. షాదీఖానా నిర్మాణ పనులను గురువారం వారు పరిశీలించారు. ఇప్పటి వరకు జరిగిన పనులు, ఇక మీదట చేయాల్సిన పనుల గురించి కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంఎల్‌ఏ నియోజకవర్గ అభివృద్ధి నిధులు రూ.30 లక్షలు, మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రూ.30 లక్షలు, నగరపాలక సంస్థ సాధారణ నిధులు రూ.70 లక్షలు షాదీఖానా మిగులు పనులు పూర్తి చేసేందుకు కేటాయించడం జరిగిందన్నారు. ఈ నిధులు ద్వారా షాదీఖానా రెండో ఫ్లోర్, కిచెన్ షెడ్‌లు, టాయిలెట్ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. త్వరలోనే అన్నీ హంగులతో షాదీఖానాను ముస్లిం, మైనార్టీలకు అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. వారి వెంట నగరపాలక సంస్థ ఇంజినీర్ కె మాల్యాద్రి, వైసిపి నాయకులు సయ్యద్ జలీల్, కాంట్రాక్టర్ కొట్టే కొండయ్య ఉన్నారు.



కాంట్రాక్టర్‌తో మాట్లాడుతున్న బాలినేని ప్రణీత్

అర్హులైన పౌరులందరికీ

ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఓటర్ల సవరణ జాబితా ముద్రణకు అధికారులు సిద్ధం కావాలని ఎలక్ట్రోరల్ రోల్ అబ్జర్వర్ ఎస్ సత్యనారాయణ ఆదేశించారు. అర్హులైన పౌరులందరికి ఓటు హక్కు కల్పించడమే ఎన్నికల కమిషన్ ముఖ్య లక్ష్యమన్నారు. ఓటర్ల సవరణ జాబితా-2023 ముద్రణపై గురువారం స్థానిక కలెక్టరేట్ లోని స్పందన సమావేశ మందిరంలో ఎన్నికల అధికారులు, రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. బాపట్ల జిల్లాలో ప్రస్తుతం 12.61 లక్షల మంది ఓటర్లు ఉన్నారని ఆయన చెప్పారు. అందులో పురుష ఓటర్లు 6,17,264 మంది ఉండగా, మహిళా ఓటర్లు 6,43,949 మంది, ఇతరులు 74 మంది ఓటర్లుగా ఉన్నారని వివరించారు. ఓటరు గుర్తింపు కార్డునకు ఆధార్ కార్డుల అనుసంధాన ప్రక్రియ బాపట్ల జిల్లాలో 69 శాతం పూర్తయిందన్నారు. మిగిలిన ఓటర్లకు ఆధార్ అనుసంధానం చేయాలన్నారు. ఓటర్ల సవరణ జాబితా ముద్రణకు జిల్లాలో అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా సంయుక్త కలెక్టర్ డాక్టర్ కె శ్రీనివాసులు చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.లక్ష్మీశివజ్యోతి, వేమూరు ఎన్నికల అధికారి జి. శ్రీనివాసరెడ్డి, రేపల్లె ఇ.ఆర్.ఓ. జె. పార్థసారధి, బాపట్ల ఇ.ఆర్.ఓ. జి. రవీందర్, పర్చూరు ఇ.ఆర్.ఓ. టి.రవికుమార్, చీరాల ఇ.ఆర్.ఓ. పి. సరోజిని పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్యనారాయణ